<u>సాధారణ సర్వ సభ్య సమావేశపు నోటీసు</u>

విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశము, ఎజెండాలో పొందుపరచిన అంశములను చర్చించుటకుగాను ది.**24-10-2008** శుక్రవారం ఉదయం గం.**10.30**ని॥లకు విజయవాడ నగరపాలక సంస్థ సభా హాలు నందు జరుగును. కావున సభ్యులందరు హాజరు కాగోరుచున్నాను.

నగరపాలక సంస్థ కార్యాలయము, విజయవాడ, తేది: **16-10-2008.**

సె క్ర ట రీ ,
విజయవాడ నగరపాలక సంస్థ.

<u>ఎ జెం డా</u>

**1/292**- ది.**22-08-08** శుక్రవారం ఉదయం గం.**10.30**ని॥లకు మరియు ది.**23-08-2008** శనివారము ఉదయం గం.**10.30**ని॥లకు జరిగిన సాధారణ సర్వ సభ్య సమావేశపు తీర్మానములను ధృవపర్చుట గురించి.

**2/293**-విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ చట్టములోని **122**వ సెక్షన్ ననుసరించి వార్డు మెంబర్లచే వేయబడిన ప్రశ్నలు.

**3/294**- దరఖాస్తుదారు శ్రీ లక్కిరెడ్డి చెన్నారెడ్డి ది.**26-12-2007** గల దరఖాస్తులో నెం.**1341/2001** గల రిజిష్టర్డ్ డాక్యుమెంట్ ద్వారా తనకు సంక్రమించిన **100** చ.గ.ల స్థలములో విజయవాడ నగరపాలక సంస్థ వారు తనకు ఎటువంటి నోటీసు జారీ చేయకుండా రోడ్డు నిర్మించి రెండు వైపులా డ్రైనేజి నిర్మాణం చేయుచుండగా తమ అభ్యంతరము తెలియచేయగా డ్రైనేజి నిర్మాణం నిలుపుదల చేసి తనకు తెలియకుండా తన స్థలము నుండి అండర్ గ్రౌండ్ డ్రైనేజి తీసినందున తనకు తగిన న్యాయం చేయవలసినదిగా కోరివున్నారు.

ఇందుపై తెలియచేయునది, సర్వే రికార్డుల ప్రకారం భవానీపురం ఆర్.ఎస్.నెం. **24/4**ఎ లోని స్థలము దస్తావేజు నెం.**1341/2001** ప్రకారం అర్జీదారుని స్థలముగా వున్నట్లు, సర్వే రికార్డుల ప్రకారం భూమిపై తనిఖీ చేయగా, భూమి రోడ్డుగా భూమిపై వున్నది. నులకపేటలో **30'-0''** రోడ్డు క్రింద సదరు **100** చ.గల స్థలము డాక్యుమెంట్ ప్రకారము దరఖాస్తుదారుని స్థలము సరిపోయినది.

ఇందుపై తెలియచేయునది విజయవాడ నగరపాలక సంస్థ వారు ఊర్మిళా సుబ్బారావు నగర్ **80'-0''** రోడ్డునకు నులకపేట నుండి **30'-0''** అడుగుల రోడ్డును కలుపుటకు ప్రతిపాదించడమైనది. సర్వే రికార్డుల ప్రకారం దరఖాస్తుదారు స్థలము రోడ్డు నిర్మాణములో పోవును.

ఇందుపై దరఖాస్తుదారు నగరంలో ఎక్కడైనా ప్రత్యామ్నాయంగా **100** చ.గల స్థలము ప్రత్యామ్నాయంగా కోరియున్నారు. ఇందుపై పాయకాపురంలోని ఎన్.ఎస్.సి. బోస్ నగర్ ఎల్.పి. నెం.**1/88**లో ప్లాట్ నెం.**2103** మరియు **2104**లోని మొత్తము **80** చ.గల స్థలము ప్రత్యామ్నాయంగా కేటాయించుటకు గుర్తించి సిఫార్సు చేసి యున్నందున దరఖాస్తుదారు శ్రీ లక్కిరెడ్డి చెన్నారెడ్డి గారికి చెందిన భవానీపురం ఆర్.ఎస్.నెం.**24/4**ఎ లోని **100** చ.గల స్థలము నులకపేట నుండి రోడ్డు వేయుటకు తీసుకున్నందున ప్రత్యామ్నాయంగా పాయకాపురం ఎన్.ఎస్.సి. బోస్ నగర్ ఎల్.పి. నెం.**1/88**లోని ప్లాట్ నెం.**2103** మరియు **2104**ల లోని మొత్తము **80**చ.గల స్థలము దరఖాస్తుదారునికి కేటాయించుటకు స్థాయీ సంఘం వారి ఆమోదం కొరకు వుంచగా స్థాయీ సంఘము వారు తమ తీర్మానము నెం.**206,** ది.**12-9-08** గల తీర్మానములో ఆఫీసు ప్రతిపాదన కౌన్సిల్ వారి ముందుంచ వలసినదిగా తీర్మానించివున్నారు. పై తీర్మానమునకు శ్రీమతి కె.శ్రీదేవి, స్థాయీ సంఘ సభ్యులు తమ డిసెంట్ నోటును ఈ క్రింది విధంగా ఇచ్చినారు.

విజయవాడ నగరపాలక సంస్థ **59**వ డివిజన్ పాయకాపురం ఎన్.ఎస్.సి. బోస్ నగర్ ఎల్.పి. నెం.**1/88**లోని ప్లాట్ నెం.**2103** మరియు **2104** ప్లాట్ల స్థలము శ్రీ లక్కిరెడ్డి చెన్నారెడ్డి గారికి కేటాయించుట కు నిరాకరిస్తూ తీర్మానించడమైనది. గతంలోని **59**వ డివిజన్ స్లమ్ ప్రాంతముగా ఉండి పునరావాసం కల్పించ బడిన స్థానిక ప్రజల ప్రజోపయోగ అవసరాలకు వినియోగించుటకు కేటాయించడమైనది. స్థానిక ప్రజల ప్రజోపయోగ అవసరాలు అన్నియూ నగరపాలక సంస్థ ద్వారానే వినియోగించి అభివృద్ధిపరచవలసియున్నందున పై తెల్పిన అంశం ప్రకారం శ్రీ లక్కిరెడ్డి చెన్నారెడ్డి గారికి కేటాయించుటను నిరాకరిస్తూ తీర్మానించుచూ డిసెంట్ నోటు ఇచ్చినారు.

స్థాయీ సంఘం వారి తీర్మానము ప్రకారము దరఖాస్తుదారు శ్రీ లక్కిరెడ్డి చెన్నారెడ్డి గారికి చెందిన భవానీపురం ఆర్.ఎస్. నెం.24/4లులోని 100 చ.గ.ల స్థలము నులకపేట నుండి రోడ్డు వేయుటకు తీసుకున్నందున ప్రత్యామ్నాయంగా పాయకాపురం ఎన్.ఎస్.సి. బోస్ నగర్ ఎల్.పి. నెం.1/88లోని ప్లాట్ నెం.2103 మరియు 2104లలోని మొత్తం 80 చ.గల స్థలము దరఖాస్తుదారునికి కేటాయించుటపై నిర్ణయం కొరకు కౌన్సిల్ వారి ముందుంచుచూ వ్రాయబడిన ఆఫీసు నోటు చదవడమైనది.
(ఆర్.సి.జి1-236/08).

4/295- విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్యము కొరకు మరియు నగరమును పరిశుభ్రముగా ఉంచుట కొరకు ప్రస్తుతము 450 డ్వాక్రా మరియు సి.యం.ఇ.వై. గ్రూపులు మరియు స్కిల్డ్ వర్కర్ల ద్వారా 3500 పనివారల సేవలను వినియోగించుకొనుట జరుగుచున్నది. డ్వాక్రా మరియు సి.యం.ఇ.వై., గ్రూపుల వారికి ప్రస్తుతము మనిషి ఒక్కరికి ఒక రోజునకు రూ.70/-లు మరియు సిల్టు గ్రూపుల వారికి ఒక మనిషికి ఒక రోజునకు రూ.90/-లు దినసరి వేతనములు చెల్లించబడుచున్నవి. ప్రస్తుతము ఒక నెలకు పై గ్రూపుల వారికి రూ.73,50,000/-లు చెల్లించబడుచున్నది.

ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఆర్.టి. నెం.1289, తేది: 9-9-2008 ఎం.ఏ. అండ్ యు.డి. డిపార్టుమెంట్ నందు పారిశుద్ధ్య పనివారలకు (ఏజెన్సీ ద్వారా కాంట్రాక్టు పద్ధతిపై) మనిషి ఒక్కింటికి ఒక నెలకు రూ.3,900/-లు వెంటనే చెల్లించవలసినదిగా ఉత్తర్వులు జారీ చేసియున్నారు. ఈ విధముగా పై గ్రూపులకు ఒక నెలకు అదనముగా రూ.63,00,000/-లు చెల్లించవలసియున్నది. మరియు సంవత్సరము నకు ఇప్పుడు దినసరి వేతనముల ప్రకారము 8.82 కోట్లు ఖర్చు అగుచున్నది. జి.ఓ.ఆర్.టి.నెం.1289, తేది: 9-9-2008 ప్రకారము వేతనములు చెల్లించిన, సంవత్సరమునకు అగు ఖర్చు రూ.16.38 కోట్లు అనగా సంవత్సరమునకు అదనముగా రూ.7.56 కోట్లు ఖర్చు అగును.

ప్రభుత్వం వారిచే జారీ చేయబడిన పై ఉత్తర్వుల ప్రకారము, విజయవాడ నగరపాలక సంస్థలో పారిశుద్ధ్య పనులు నిర్వహించుచున్న పనివార్లు అనగా డ్వాక్రా, సిల్టు, సి.యం.ఇ.వై., గ్రూపులు మరియు కాంట్రాక్టు పనివార్లకు మనిషి ఒక్కరికి ఒక నెలకు రూ.3,900/-లు చొప్పున చెల్లించుటకు అనుమతి కోరుచున్న ఆఫీసు సూచనను చదవటమైనది.

మరియు అవసరమైన రెవెన్యూను రాబట్టుటకుగాను అవసరమైన సూచనలను పొందుటకుగాను, అడ్‌హాక్ కమిటీని నియమించుటకు అనుమతి కోరుచున్న ఆఫీసు వారి సూచన చదవడమైనది.
(ఆర్.సి.ఎఫ్.4-22733/06).

5/296- విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయములో గల పౌర సేవా కేంద్రములో హెల్ప్ డెస్క్ అసిస్టెంటు, జనన మరణ ధృవీకరణ పత్రముల కొరకు వచ్చు ప్రజలకు ఫారము నింపుటలో తోడ్పడుతుంటారు. సదరు ఫారములను ఆఫీసు స్టేషనరీ రూముల నుండి తీసుకొని వచ్చి సాయంత్రము వెళ్లునపుడు ఖాళీ ఫారములను డి.యస్.ఓ. గారికి కేటాయించిన రూములో గల డెస్కునందు తాళమువేసి భద్రపరచుట జరుగుచున్నది. ది.17-8-2007న హెల్ప్ డెస్క్ అసిస్టెంటు డెస్కు తెరచి చూడగా అందు షుమారు 12 పుస్తకములు (ఒక్కొక్కటీ 100 ఫారములు గలవి) పోయినట్లుగా గుర్తించి ఆఫీసునకు రిపోర్టు చేసినారు.

దానిపై సంబంధిత హెల్ప్ డెస్క్ అసిస్టెంట్ అయిన శ్రీమతి యం.నిర్మల జ్యోతి, జూనియర్ అసిస్టెంటుకు రికార్డు భద్రపరచు విషయములో నిర్లక్ష్యముగా వ్యవహరించినందున ఆంధ్రప్రదేశ్ సి.సి.ఎ. రూల్సు 1991 ప్రకారము ఆమెకు ఛార్జి మెమోను ది.14-9-2007న యివ్వటమైనది.

శ్రీమతి యం.నిర్మల జ్యోతి, జూనియర్ అసిస్టెంటు గారు ది.4-10-07 తేదీన గల సంజాయిషీలో తనకు హెల్ప్ డెస్క్ కౌంటరులో రికార్డు భద్రపరచుకొనుటకు ఎటువంటి అలమారాలుగానీ, కబోర్డ్సుగానీ కల్పించనందున డి.యస్.ఓ. గారి రూములో భద్రపరచుచున్నానని సదరు ఖాళీ ఫారములు పోవుట తన తప్పిదము కాదని తెలిపినారు.

సదరు సంజాయిషీపై ఎంక్వైరీ ఆఫీసరుగా డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) గారిని నియమించి, విచారించగా సదరు అభియోగములు నిజమని నిర్ధారింపబడినవి.

ఎంక్వైయిరీ ఆఫీసరు రిపోర్టు ననుసరించి శ్రీమతి యం.నిర్మల జ్యోతి, జూనియర్ అసిస్టెంటు గారికి ఒక సంవత్సరము వార్షిక యింక్రిమెంటును తాత్కాలిక పద్ధతిపై నిలుపుదల చేయుచూ ది.15-4-2008న ఉత్తర్వులు జారీ చేయడమైనది.

శ్రీమతి యం.నిర్మల జ్యోతి, జూనియర్ అసిస్టెంటు గారు తన అప్పీలు నందు తనతోపాటు మరో యిద్దరు జూనియర్ అసిస్టెంట్లు హెల్ప్ డెస్క్ కౌంటరు నందు నియమింపబడినారని, రికార్డు భద్రపరచుట అందరి భాద్యత అయినప్పటికీ, తనకు మాత్రమే శిక్షను విధించినారని, సదరు రికార్డు విలువ స్వల్పమైనప్పటికీ, తనకు ఏడాదిపాటు ఆర్థికముగా యింక్రిమెంటు లాభమును నిలుపుదల చేసినారని తెలుపుతూ తనకు విధించిన శిక్షను రద్దుపరచవలసినదిగా కోరినారు.

ఆఫీసు నందు గల రికార్డును సక్రమముగా భద్రపరచుట ప్రతియొక్క ఉద్యోగి విధి. ఆఫీసు నందు గల స్టేషనరీ రూములో రికార్డు అందుబాటులో వున్నప్పటికీ ఒకేసారి అధిక మొత్తములో స్వయముగా తీసుకొని, సదరు రికార్డును సక్రమముగా భద్రపచకపోవడం అనేది శ్రీమతి యం.నిర్మల జ్యోతి, జూనియర్ అసిస్టెంటు గారి యొక్క నిర్లక్ష్యము, భాద్యతారాహిత్యముగా కనిపించుచున్నది. విధి నిర్వహణలో నిర్లక్ష్యముగా వ్యవహరించి నప్పటికీ ఆమెకు విధించిన శిక్ష చాలా స్వల్పమైనది దానిని తగ్గించనవసరము లేదు.

ఆంధ్రప్రదేశ్ సి.సి.ఎ. రూల్సు 1991 ప్రకారము ఆఫీసు వారు విధించిన (ఒక సంవత్సరము వార్షిక యింక్రిమెంటును తాత్కాలిక పద్ధతిపై నిలుపుదలను) శిక్షపై సకాలములో అప్పీలు పెట్టుకున్నందున, శ్రీమతి యం.నిర్మల జ్యోతి, జూనియర్ అసిస్టెంటు గారికి విధించిన శిక్షను రద్దుపరచు విషయములో తగు నిర్ణయము తీసుకొనుటకుగాను కౌన్సిల్ వారి ముందుంచడమైనది. (ఆర్.సి.సి24-129664/2008).

6/297- ప్రభుత్వము వారు జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.303, ఫైనాన్సు (పి.సి.-1) డిపార్టుమెంటు, తేది: 15-10-08 నందు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మరియు మునిసిపల్ కార్పోరేషన్ ఉద్యోగులకు రెండు దఫాలుగా మొత్తము 22% (15+7) యింటీరిమ్ రిలీఫ్ మంజూరు చేసియున్నారు.

మొదటి దఫాగా 15% ది.1-10-2008 నుండి నగదు రూపములో చెల్లించుటకు మరియు రెండవ దఫాగా 7% ది.1-1-2009 నుండి ది.31-3-2009 వరకు ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో ఏప్రియల్, మే మరియు జూన్ నెలల యందు జమ చేయుటకు మరియు ది.1-4-2009 నుండి మొత్తము 22% జీతముతోపాటు చెల్లించుటకు జారీ చేసిన జి.ఓను కౌన్సిల్ వారి ముందుంచడ మైనది.

కావున, సదరు జి.ఓ. యం.యస్. నెం.303, ఫైనాన్సు (పి.సి.-1) డిపార్టుమెంటు, తేది: 15-10-08 రికార్డు నిమిత్తము కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు సూచనను చదవడమైనది. (ఆర్.సి.సి1-11643/05).

7/298- ప్రభుత్వము వారి ఉత్తర్వులు నెం.86 ఎమ్.ఏ., తేది: 21-2-2003 మరియు జి.ఓ.యమ్.ఎస్. నెం.480 ఎం.ఏ., అండ్ యు.డి.(ఎన్.1) డిపార్టుమెంటు, తేది: 20-10-2003 ననుసరించి నగరపాలక సంస్థ పరిధిలోని గుణదల, పటమట గ్రామములలోని జవహర్ ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతములు మరియు పటమట గ్రామములోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ మరియు జవహర్ ఆటోనగర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లను 35% రాబడి నగరపాలక సంస్థకు మరియు 65% ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్ లిమిటెడ్ (APIIC) వారికి సదరు ఆదాయము పంచుకొనే విధముగా కొన్ని షరతులకు లోబడి APIIC వారికి బదలీ చేయబడినది.

తదుపరి ప్రభుత్వము ఉత్తర్వులు నెం.735 ఎమ్.ఏ., తేది: 3-10-07లో ఆస్థి పన్ను వసూలులో గతములోని 35 శాతమునకు బదులుగా 50 శాతము కార్పోరేషన్‌కు చెల్లింపు చేయు విధముగా మరియు సదరు చెల్లింపులు వసూలుపై కాక డిమాండ్ మొత్తముపై చెల్లించు విధముగాను మరియు కొన్ని సవరణలతో జారీ చేయబడిన ఉత్తర్వులను సూచనలను, నిబంధనలను కౌన్సిల్ రిజల్యూషన్ నెం.295, తేది: 28-12-07 గా రికార్డు చేయబడినది.

ప్రస్తుతము ప్రభుత్వ మెమో నెం.11040/జె2/2008-6, తేది: 4-8-08 ననుసరించి ప్రభుత్వము సదరు అన్ని విషయములు పరిశీలించిన పిదప నగరపాలక సంస్థ పరిధిలోని గుణదల, పటమట గ్రామములలోని

జవహర్ ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ప్రాంతములు మరియు పటమట గ్రామములోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో (ఆస్థి పన్ను విధింపు మరియు వసూలు చేసుకొను హక్కు) మరియు జవహర్ ఆటోనగర్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లపై ఆదాయము వసూలు చేసుకొను హక్కులు APIIC వారికి బదలాయించబడిన అధికారములను ఉపసంహరించి తిరిగి విజయవాడ నగరపాలక సంస్థ విధించు మున్సిపల్ పన్నులు విధించుటకు మరియు వసూలు చేసుకొనుటకు అధికారములు యిచ్చుటకున్నూ సదరు ఆదాయము నందు APIIC వారికి 50% యిచ్చుటకున్నూ మరియు APIIC వారే సదరు ప్రాంతములందు "internal infrastructure and civic services and maintain them as per standards stipulated" ప్రకారము నిర్వహించుకొనవలెనని తెలియచేస్తూ సదరు ఉత్తర్వులందు తెలియచేసిన ప్రకారము విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ వారి రిమార్కులు, అభిప్రాయములు ఈ ఉత్తర్వులు అందిన నెలలోపు తెలియచేయవలసినదిగానూ అట్లు సకాలము లో తెలియచేయని యెడల ప్రభుత్వము వారిచే తగిన ఉత్తర్వులు జారీ చేయబడునని తెలియచేసినారు (ఉత్తర్వుల నకలును జతపరచడమైనది). సదరు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారము తగిన వ్యవధి లేనందున అందరు ఫ్లోర్ లీడర్లతో సమావేశము ఏర్పరచి చర్చించి ఈ దిగువ నిర్ణయములను గవర్నమెంటు వారికి పంపుట జరిగినది.

1) ఇంటి పన్నులు, ఖాళీ స్థలములపై పన్నులు, డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్సు ఫీజులు, వృత్తి పన్నులు, ప్రకటనల పన్నులు, కాంప్లెక్స్ అద్దెలు, బిల్డింగ్ లైసెన్సు ఫీజులు మొదలగునవి నగరపాలక సంస్థ వారిచే వసూలు చేయబడి, వసూలు చేసిన మొత్తములో 50 శాతము IALA వారికి, 50 శాతము విజయవాడ నగరపాలక సంస్థకు చెందవలసియున్నది.
2) విజయవాడ నగరపాలక సంస్థ వారిచే కల్పించబడిన నీటి సరఫరా, డ్రైనేజి సౌకర్యములకై వసూలు చేయు పన్నులు పూర్తిగా నగరపాలక సంస్థకు చెందుటకు.
3) IALA వారికి 50 శాతము వాటాపై పరిపాలనా ఛార్జీలు మినహాయించుటకు.
4) IALA వారు నగరపాలక సంస్థకు 30-9-08 నాటి వరకు చెల్లించవలసియున్న బకాయిలు మినహాయింపు చేసుకొనుటకు.
5) IALA వారు వారి పరిధిలో గల ప్రాంతములలో అభివృద్ధి, మౌలిక సదుపాయములు, యితర పౌర సేవలు వారే ఏర్పాటు చేసుకొనుటకు మరియు నిర్వహించుకొనుటకు.
6) ఆటోనగర్ అభివృద్ధి కొరకు తీసుకొనబడిన హడ్కో ఋణము కార్పోరేషన్‌కు భారముగా ఉన్నందున IALA వారే చెల్లించుటకు.

పైన తెలిపిన షరతులకు లోబడి ది.1-10-2008 నుండి అమలులోనికి వచ్చు విధముగాను ది.30-9-08 వరకు వసూలు చేసిన రికార్డు వివరములను నగరపాలక సంస్థ, విజయవాడ వారికి అప్పగించుటకు నిర్ణయము చేయడమైనది.

అందుపై అందరు ఫ్లోర్ లీడర్లతో సమావేశము జరిపి తీసుకొన్న నిర్ణయములను ర్యాటిఫై చేయుటకు గాను కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు సూచన చదవడమైనది. (ఆర్.సి.ఎ12-1513/2005).

8/299- జి.ఓ.యం.యస్. నెం.572, తేది: 8-11-2006 మరియు నెం.810, తేది: 13-11-2007 నందు డా॥ పి.వి. రమణ మూర్తి, మెస్సర్స్ ఆంధ్రా హాస్పిటల్స్ వారికి సి.వి.ఆర్. స్కూలు ప్రాంగణములో ఆంధ్రా హాస్పిటల్స్ ప్రక్కన క్యాన్సర్ హాస్పిటల్ నిర్మాణమునకు 700 చ.గ.ల స్థలమును వారి స్వంత ఖర్చులతో నిర్మించుకొనుటకు 12 సంవత్సరములకు, సంవత్సరమునకు 10 లక్షల చొప్పున 3 సంవత్సరములకు ఒకసారి లీజు మొత్తమును 33 1/3 % పెంపుదలపై లీజుకిచ్చుటకు ఉత్తర్వులు జారీ చేయబడినందున కౌన్సిలు వారి తీర్మానము నెం.522, ది.6-1-2007, నెం.293, తేది: 28-12-2007 నందు రికార్డు చేయడమైనది.

తదుపరి డా॥ పి.వి. రమణమూర్తి, చీఫ్ ఎగ్జిక్యూటివ్, మెస్సర్స్ ఆంధ్రా హాస్పిటల్స్ వారి లేఖ ది.23-11-2007 నందు ఎలాట్ చేసిన ఖాళీ స్థలము యొక్క లీజు మొత్తము చాలా ఎక్కువగా ఉన్నందున, లీజు కాలము ముగిసిన పిదప నగరపాలక సంస్థకు అప్పగించవలసియున్నందున మరియు సదరు క్యాన్సర్ హాస్పిటల్ పేదలకు ఉచిత సేవలు అందించబడుననియూ, అందుపై ఈ క్రింది తెలిపిన విషయములలో సడలింపు యివ్వవలసినదిగా కోరినారు.

1. 3 సంవత్సరములకు ఒకసారి 33 1/3 % నుండి 10%కు తగ్గించుట.
2. లీజు కాలము 12 సంవత్సరముల నుండి 25 సంవత్సరములకు పొడిగించుట.

సదరు లీజుపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంటు, ఆంధ్రప్రదేశ్ వారి మెమో నెం.25456/కె2/2007-1, తేది: 6-2-2008 నందు సదరు లీజు పొడిగింపు మరియు 3 సంవత్సరములకు ఒకసారి అద్దె పెంపుదల విషయములలో నూతనముగా కౌన్సిల్ వారి తీర్మానముతో ఒక రిపోర్టు పంపవలసినదిగా కోరినారు. సదరు విషయములు కౌన్సిల్ వారి ముందుంచగా వారి తీర్మానము నెం.13, ది.4-4-2008 ప్రకారము సదరు హాస్పిటల్ వారికి కేటాయించిన 700 చ.గ. ఖాళీ స్థలము యొక్క లీజు కాలము 12 సంవత్సరముల నుండి 25 సంవత్సరములు పొడిగించుచూ లీజు మొత్తము ప్రతి మూడు సంవత్సరములకు ఒకసారి 33 1/3 % నుండి 10% కు తగ్గించుచూ తీర్మానించడమైనది.

సదరు తీర్మానము ప్రకారము ప్రభుత్వము వారిని తగు చర్యల నిమిత్తము కోరగా ప్రభుత్వము వారి జి.ఓ.ఆర్.టి. నెం.1189, తేది: 18-8-2008 నందు సదరు 700 చ.గ.ల స్థలము లీజు కాలము 12 సంవత్సరముల నుండి 25 సంవత్సరములకు పెంపుదలపై జి.ఓ.యం.యస్. నెం.535 ఎం.ఏ., ది.7-7-98 నందు పొందుపరచిన నిబంధనలకు లోబడి లీజు కాలము పొడిగించడమైనది. మరియు ముడు సంవత్సరములకు ఒకసారి లీజు మొత్తము 33 1/3 % నుండి 10% కు తగ్గించుటకు తిరస్కరించడమైనది.

కావున జి.ఓ.ఆర్.టి. నెం.1189, యం.ఏ., తేది: 18-8-2008ను రికార్డు నిమిత్తము కౌన్సిల్ ముందుంచిన ఆఫీసు సూచన చదవడమైనది. (ఆర్.సి.ఎ7-6460/2001).

శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్, 14వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

9/300- విజయవాడ నగరం, ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద నగరములలో మూడవ నగరం. రవాణా, వ్యాపార, విద్యాలయాలకు నిలయం. అలాంటి నగరం నడిబొడ్డు నుండి ఎన్.హెచ్. నెం.5 మద్రాసు నుండి కలకత్తా రహదారి ద్వారా రోజూ వేల సంఖ్యలో వాహనాలు నడుచున్నవి. ముఖ్యంగా బెంజి కంపెనీ దగ్గర నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఉన్న ప్రాంతములో మేరీస్ స్టెల్లా కాలేజి, లయోలా కాలేజి, సిద్దార్థ కాలేజి, ఎన్.టి.ఆర్. హెల్త్ యూనివర్శిటీ, పాలిటెక్నిక్, ఐ.టి.ఐ., శ్రీ చైతన్య నారాయణ ఇలా ఎన్నో కళాశాలలు ఈ ప్రాంతమందే వున్నవి. ముఖ్యంగా పేద మద్య తరగతి ప్రజలు చదువుకొనే లయోలా మరియు మారీస్ స్టెల్లా, సిద్దార్థ మరియు ప్రభుత్వ ఆసుపత్రి ఇలా ప్రతినిత్యం పేద విద్యార్థులు సైకిళ్ళ ద్వారా రోజూ, వారి కాలేజీలకు వెళ్ళే మార్గం, అయితే ప్రతి రోజూ వారి తల్లితండ్రుల జీవితాల్లో పిల్లలు ఇంటికి తిరిగి వస్తారా క్షేమంగా! అనే వేధన. ఈ మధ్య కాలంలో ఈ ప్రాంతములో ఎంతో మంది విద్యార్థులు మరియు ఇతర శ్రమ జీవులు మరణించినారు. నిత్యం బెంజి సర్కిల్ దగ్గర, నిర్మలా కాన్వెంట్ జంక్షన్ దగ్గర, రమేష్ హాస్పిటల్ జంక్షన్, మహానాడు రోడ్ జంక్షన్, రామవరప్పాడు జంక్షన్ ఈ ప్రదేశాలలో వేలాది వాహనాలు సిగ్నల్ దగ్గర క్యూ కట్టినప్పటికీ, తరగని మరణాలు క్షణంలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. ఇంతటి ప్రాధాన్యత మరియు ప్రమాదభరితమైన ప్రదేశంలో ఫ్లై ఓవర్ లేకపోవడం మన దురదృష్టకరం. పై కారణాల వలన తక్షణం రామలింగేశ్వర నగర్ స్క్రూ బ్రిడ్జి దగ్గర నుండి రామవరప్పాడు రింగ్ వరకు ఫ్లై ఓవర్ నిర్మించగలరని ప్రతిపాదించడమైనది.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

10/301- విజయవాడ నగరపాలక సంస్థ హెల్త్, మలేరియా, వివిధ విభాగములలో పనిచేయుచున్న డ్వాక్రా, సి.ఎం.ఇ.వై., కాంట్రాక్టు కార్మికుల వేతనాలు రాష్ట్ర ప్రభుత్వ జి.ఓ.ఆర్.టి.నెం.1289, తేది: 9-09-2008 ప్రకారం ప్రతి నెలకు రూ.3,900/-లుగా సవరించి వేతనాలు అమలు జరుపుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీమతి పెన్మెత్స దుర్గాభవాని, 53వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

11/302- దేవీనగర్, మధురా నగర్ మద్య గల బుడమేరు, ఏలూరు కాలువపై వున్న ఫుట్ బ్రిడ్జి స్థానంలో పెద్ద వంతెనలు నిర్మించవలసినదిగా ప్రతిపాదన.

12/303- జి.ఓ.ఎం.ఎస్. నెం.1289 ప్రకారం కాంట్రాక్టు కార్మికులకు నెలసరి జీతం రూ.3,900/-లుగా పెంచి తక్షణం అమలు చేయవలసినదిగా ప్రతిపాదన.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

13/304- విజయవాడ నగరంలో వ్యాపించిన డెంగ్యూ, మలేరియా విష జ్వరాలు వలన నగర ప్రజలు తీవ్ర భయాందోళన లకు గురిఅవుచున్నారు. కావున నగరంలో ప్రబలిన డెంగ్యూ తదితర విష జ్వరాల నివారణకు తగు చర్యలు చేపట్టవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీమతి పిల్లి లక్ష్మి తులసి, 45వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

14/305- హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జి.హెచ్.ఎమ్.సి.) మరియు 60 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లకు సహకారం అందించటంలో ముందంజలో ఉన్న ప్రముఖ స్వచ్ఛంథ సంస్థ ''హెల్పేజ్ ఇండియా''లు సంయుక్తంగా 'ఆసరా' అనే ప్రోగ్రాం ద్వారా సీనియర్ సిటిజన్లకు వివిధ సేవలను అందిస్తుంది. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 'ఆసరా' కాల్ సెంటర్ అనే 1253 హెల్ప్ లైన్ ద్వారా ఫిర్యాదును నమోదుచేసి పలు సమస్యలు పరిష్కరిస్తున్నారు. 60 సం.ములు పైబడిన వారికి ''ఆసరా'' ప్రివిలేజ్ మరియు గుర్తింపు కార్డును గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఉచితంగా జారీ చేస్తుంది. సీనియర్ సిటిజన్లు ఆరోగ్యకరమైన, శాంతియుతమైన, గౌరవ ప్రదమైన జీవితాన్ని గడిపేందుకు తోడ్పడుతున్న ఈ 'ఆసరా' కార్యక్రమాన్ని మన విజయవాడ నగరపాలక సంస్థ కూడా నిర్వహించాలని తద్వారా వయోవృద్దులకు అవసరమైన సేవలందించాలని కౌన్సిల్ వారిని కోరుచూ ప్రతిపాదించడమైనది.

శ్రీ నడకుదిటి సుబ్బరాజు, 12వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

15/306- 12వ డివిజన్ నందు గల ఎస్.ఎస్.ఎం. రోడ్డు (నల్లూరి వారి వీధి) డోర్ నెం.68-2-25 గల ఇంటి యజమాని అయిన శ్రీ కీలు శ్రీనివాస రావు గారి ఇంటి ముందు మన నగరపాలక సంస్థకు చెందిన స్థలము షుమారు 51.00 చ.గ.లు కలదు. ఆ స్థలము గత 16 సం.ముల నుండి నిరుపయోగముగా వుంటూ కార్పోరేషన్‌కు ఏ విధమైన ఆదాయము లేకుండా ఉన్నందున సదరు స్థలమును శ్రీ కీలు శ్రీనివాస రావు గారికి వారి ఇంటి ముందు భాగమున ఉండుట వలన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారము తగు రుసుము నిర్ణయించి యిచ్చిన, వారు తీసుకొనుటకు అంగీకారము తెలిపియున్నారు.

కావున పై స్థలమును శ్రీ కీలు శ్రీనివాస రావు గారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారము తగు రేటుకు నిర్ణయించుటకు ప్రతిపాదించుచున్నాను.

16/307- 12వ డివిజన్ పరిధిలోని పటమటలంక వి.ఎం.సి. మున్సిపల్ హైస్కూలులో ఎలిమెంటరీ స్కూలు బిల్డింగ్‌పై ఫస్ట్ ఫ్లోరులో 5 తరగతి గదులు నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ గోగుల రమణా రావు, 54వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

17/308- నగరపాలక సంస్థలో పనిచేసే డ్వాక్రా, సి.యం.ఇ.వై., కేర్ టేకర్స్‌కు, వాచ్‌మెన్స్‌కు ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

18/309- ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మరియు అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్ వారు బిల్డింగ్ రెగ్యులేషన్ మరియు పీనలైజేషన్ అనాథరైజ్డ్ బిల్డింగ్ నిర్మాణాలకు సంబంధించి ది.18-9-2008న విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వ జి.ఓ.ఎం.యస్. నెం.642ను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీ పి.గౌతమ్ రెడ్డి, 44వ వార్డు మెంబర్ మరియు శ్రీమతి వీరమాచినేని లలిత, 43వ వార్డు మెంబర్ గార్ల ప్రతిపాదన :-

19/310- బ్రహ్మానంద రెడ్డి బ్రిడ్జి ప్రక్కనే మరొక బ్రిడ్జి నిర్మాణం చేయాలని ప్రతిపాదించడమైనది. సదరు బ్రిడ్జి చిన్నది అగుట వలన ట్రాఫిక్ విపరీతంగా పెరిగిపోయి ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుచున్నది. కావున, బ్రహ్మానంద రెడ్డి బ్రిడ్జి ప్రక్కన మరొక బ్రిడ్జి నిర్మాణం చేయాలని ప్రతిపాదించడమైనది.

శ్రీ కునుకు రాజశేఖర్, 42వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

20/311- విజయవాడ నగర పరిధిలో గవర్నమెంట్ స్థలాలలో కాకుండా, అనేక సంవత్సరములుగా మురికివాడలుగా గుర్తించబడి, ఇతర స్థలాలలో నివసిస్తున్న పేదలకు నగరపాలక సంస్థ ద్వారా స్థల యజమానులతో ఉన్న వివాదాలలో లీగల్ ఎయిడ్ సమకూర్చవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి పెన్మెత్స దుర్గాభవాని, 53వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

21/312- స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి గండికొట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ది.18-09-2008న జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.642ను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ప్రతిపాదన.

శ్రీ దోనేపూడి కాశీనాథ్, 23వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

22/313- అనేక దశాబ్దాలుగా జీవనం సాగించేందుకు అనువుగా వున్న మహంతీ మార్కెట్, గోవింద రాజుల మార్కెట్‌లను తొలగించడం ద్వారా వందల కుటుంబాలకు జీవనాధారమైన జీవనోపాధి కోల్పోతారు. అది పోకుండా నిలబెట్టేందుకు అదే ప్రాంతంలో మార్కెట్‌ను తొలగించకుండా వుండేందుకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీ బోయి సత్యబాబు, 37వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

23/314- షేక్ రాజా సాహెబ్ ప్రసూతి వైద్యశాలలో వున్న దంత వైద్యశాలలో డాక్టర్‌ను నియమించవలసినదిగా కోరుతూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీమతి మురిపాల సత్యవతి, 58వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

24/315- 58వ డివిజన్ రాధానగర్‌లో పార్కు స్థలములు ఖాళీగా ఉన్నాయి. వాటిలో లైబ్రరీ నిర్మించుటకు తగు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదన.

25/316- 58వ డివిజన్ ఉడా కాలనీని కార్పోరేషన్‌లో విలీనం చేయుటకు తగు చర్యలు తీసుకోవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ కాశీనాథ్ దోనేపూడి, 23వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

26/317- ఎ.పి. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలలో పనిచేస్తున్న పబ్లిక్ హెల్త్ మరియు నాన్-పబ్లిక్ హెల్త్ కార్మికులకు, 4వ తరగతి ఉద్యోగులను ప్రోత్సహించుటకు ప్రతి సంవత్సరం యూనిఫారం, చెప్పులు, నూనె మంజూరుచేస్తూ జి.ఓ.ఎం.ఎస్. నెం.349 ఎం.ఏ., తేది: 17-7-86 ప్రకారం యివ్వడం జరుగుచున్నది. విజయవాడ నగరపాలక సంస్థ నందు కూడా ఈ జి.ఓ. ప్రకారం 2005వ సంవత్సరం వరకు యివ్వడం జరిగినది. కానీ, 2006 నుండి యూనిఫారం, చెప్పులు, నూనె మరియు కుట్టు ఛార్జీలు వంటి ఐటమ్స్ విజయవాడ నగరపాలక సంస్థ 4వ తరగతి కార్మికులకు అమలు జరుపుటకు వెంటనే తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీమతి పెన్మెత్స దుర్గా భవాని, 53వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

27/318- రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ''రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం''పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకై డివిజన్ల వారీగా సదస్సులు నిర్వహించాలని కోరుతూ ప్రతిపాదన.

శ్రీ దోనేపూడి కాశీనాద్, 23వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

28/319- విజయవాడ నగరపాలక సంస్థ వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఫుల్ టైమ్ కంటింజెంట్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ జి.ఓ.యం.యస్. నెం.179, తేది: 3-07-2008 ప్రకారము ప్రతి నెలకు సవరించిన వేతనము రూ.2080/-లు చెల్లించు విధముగా తగు చర్యలు చేపట్టాల్సినదిగా కోరుతూ ప్రతిపాదించడ మైనది.

శ్రీ పి.గౌతమ్ రెడ్డి, 44వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

29/320- స్థానిక లబ్బీపేటలో 'పైడియ్య' వీధి నుండి కాలువ ఒడ్డు మీదుగా పిచ్చయ్య వీధి వరకు రోడ్డు వేయవలసి వున్నది. ప్రజలు పిచ్చయ్య వీధి నుండి గాని, పైడియ్య వీధి నుండి గాని, మసీదు వీధి నుండి దక్షిణం వైపుకు వెళ్ళి మరలా తిరిగి వెనుకకు రావాల్సి వస్తున్నది. దీని వలన ప్రజలు ఇబ్బంది పడుచున్నారు. కావున, పైడియ్య వీధి నుండి కాలువ ఒడ్డు గుండా పిచ్చయ్య వీధిని కలుపుచూ రోడ్డు వేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

30/321- రాఘవయ్య, అంబేద్కర్ పార్కులను మరియు రైవస్ కాలువ ఒడ్డున ఉన్న 2 ఎకరాల స్థలమును ప్రైవేట్ సంస్థలకి లీజుకివ్వడానికి ది.29-9-2008న ఆర్.సి.హెచ్.1-132645/08 ఉత్తర్వులు ప్రకారం ఇచ్చిన EXPRESSION OF INTEREST ఉత్తర్వులు రద్దుపరచవలసినదిగాను, రాఘవయ్య అంబేద్కర్ పార్కులను నగరపాలక సంస్థ ద్వారానే నిర్వహించాలని, రైవస్ కాలువ గట్టు స్థలాన్ని ప్రజా ప్రయోజనావసరాలకు నగరపాలక సంస్థ ద్వారానే నిర్వహణకు ఉపయోగించాలని కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీమతి కోనేరు రమాదేవి, 9వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

31/322- విజయవాడ కార్పోరేషన్ పరిధిలో గల రైతు బజారులలో ఉన్న క్యాంటీన్‌లు కార్పోరేషన్‌కు చెల్లించవలసిన డి అండ్ ఓ ట్రేడు లైసెన్సు కట్టించుకొనేటట్లు, అలాగే రైతు బజారులో ఉన్న రెంటుకడుతున్న షాపుల వద్ద డి అండ్ ఓ ట్రేడ్ లైసెన్సులు కట్టించుకొనేటట్లు తీర్మానము చేయవలసినదిగా కోరుచున్నాను.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

32/323- భూగర్భ డ్రైనేజి కనెక్షన్లకు సంబంధించి డొనేషన్లు, రోడ్డు కటింగ్ ఛార్జీల విషయములో చేసిన తీర్మానాలను అమలు జరుపుటకు వెంటనే తగు చర్యలు చేపట్టవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీమతి నల్లూరు ఉషారాణి, 8వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

33/324- 8వ డివిజన్‌లో గల విజయవాడ నగరపాలక సంస్థకు సంబంధించి సాయి బాబా గుడి దగ్గర షాపింగ్ కాంప్లెక్సు మొదటి అంతస్తు నందు ''ఈ-సేవా కేంద్రము'' నెలకొల్పుటకు 3 సం.ముల క్రితము తయారు కాబడివున్న దానిలో ''ఈ-సేవా'' కేంద్రము ప్రజల సౌకర్యార్థము వెంటనే ఏర్పాటు చేయుటకు తగు చర్యలు తీసుకొన వలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ మహాదేవు అప్పాజీ రావు, 38వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

34/325-పేద వృద్ధులకు ఇచ్చే వృద్ధాప్య పింఛన్ యొక్క అర్హత వయస్సు 60 సం.ములకు తగ్గిస్తూ ప్రతిపాదనను ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి మన తీర్మానము పంపించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

35/326- డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణా కేంద్రాలను కొనసాగించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

శ్రీ చిగురుపాటి బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

36/327-విజయవాడ నగరపాలక సంస్థ 2008-09 సంవత్సర బడ్జెట్ నందు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు, వివిధ పథకాలకు కేటాయించిన నిధులు ప్రకారం ఆయా కేటాయింపుల కనుగుణంగా ఆయా అభివృద్ధి కార్యక్రమాల పనులు సత్వరమే సకాలంలో పూర్తి చేయుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

శ్రీ ఆకుల వెంకట కిరణ్ కుమార్, 50వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

37/328- ప్రతి సంవత్సరములాగే ప్రతిష్ఠాత్మకముగా నిర్వహించు రాష్ట్ర స్థాయి యువజనోత్సవములు యధావిధిగా ఈ సంవత్సరము అనగా 2008-09 సంవత్సరమునకు, 2009 జనవరి నెలలో నిర్వహించుటకు మరియు నవంబరు నెలలో యువజనోత్సవముల కార్యాలయము ప్రారంభించుటకు ప్రతిపాదించడమైనది.

<u>శ్రీమతి వీర్ల వరలక్ష్మి, 57వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-</u>

38/329- 57వ డివిజన్‌లో ప్రకాష్ నగర్ నూతనముగా నిర్వహిస్తున్న రిజర్వాయరు ఎదురుగా ట్రాన్స్‌ఫార్మర్ కలదు. అది రోడ్డుకి అడ్డంగా వుండి చాలా ప్రమాదం జరుగుతుంది. కాబట్టి ట్రాన్స్‌ఫార్మర్‌ను వెనుకకి జరిపించ వలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

39/330- 57వ డివిజన్‌లో మరియు 55, 56, 57, 58, 59 డివిజన్లలో ఎవరైనా చనిపోయిన యెడల వారి కర్మకాండలు నిర్వహించుటకు తగినంత వసతులు లేనందున సింగ్ నగర్ స్మశాన వాటిక దగ్గర కర్మల భవనం నిర్మించవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

40/331- 57వ డివిజన్‌లో 41 మరియు 53 బ్లాకుల మధ్య గల రామాలయం దగ్గర గల స్థలంలో రీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీ ఖాధర్, 27వ వార్డు; శ్రీ వై.చలపతి రావు, 26వ వార్డు మరియు</u>
<u>శ్రీ పత్తి నాగేశ్వర రావు, 28వ వార్డు మెంబర్ గార్ల ప్రతిపాదన :-</u>

41/332-విజయవాడ - హైదరాబాదు నేషనల్ హైవే (ఎన్.హెచ్-9) రోడ్డునకు ఇరు ప్రక్కల అనగా కార్పోరేషన్ డివిజన్లు 26, 27, 28 లలో చాలా సం.ముల నుండి నివశించుచున్న వారి గృహములు పాతబడి, వాటిని పునర్మించినప్పుడు లేదా నూతన నిర్మాణముల కొరకు ప్లాన్లు మంజూరు చేయుట లేదు.

మాస్టర్ ప్లాను యందు నేషనల్ హైవే రోడ్డు వెడల్పు 200 అడుగులుగా చూపించబడి వున్నది. పాత రోడ్డు ప్లాను ప్రకారము 2 లైన్ల రోడ్డు మాత్రమే కలదు. కానీ అది ప్రస్తుతము 4 లైన్ల రోడ్డుగా చూపించటం జరుగుతున్నది.

గొల్లపూడి నుండి బైపాస్ రోడ్డు ప్రస్తుతము రన్నింగ్‌లో ఉండగా మరి అవుటర్ రింగ్ రోడ్డు ప్రపోజల్ కూడా ఉన్న సంగతి మనకు తెలిసినది.

ఈ సందర్భములో పై తెలుపబడిన విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవే రోడ్డునకు ఇరు ప్రక్కలా అనగా కార్పోరేషన్ డివిజన్లు 26, 27, 28 వరకు మాత్రమైన రోడ్డును కొంత పరిమితికి నిర్ణయించి ఇప్పటికైనా ఈ స్థిర నివాసస్థులకు భవన నిర్మాణముల కొరకు ప్లానుల అనుమతిని మంజూరు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

<u>శ్రీ పి.గౌతమ్ రెడ్డి, 44వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-</u>

42/333- జె.ఎన్.ఎన్.యు.ఆర్.ఎం. నిధులు మన నగరములో ఖర్చు చేయుచున్న సందర్భముగా అభివృద్ధి పనులకుగాను ఎస్కలేషన్ ఛార్జీలు పెరిగిపోయి షుమారు 350 కోట్లు అదనంగా ఖర్చు కాగలదని తెలిసినది. కావున, పెరిగే ఎస్కలేషన్ ఛార్జీలు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ప్రతిపాదించడమైనది.

43/334- బి.పి.ఎస్. నిధులను రాష్ట్ర ప్రభుత్వము వారి ఖజానాకు పంపాలని నగరపాలక సంస్థకు ఉత్తర్వులు పంపడం జరిగినది. సదరు ఉత్తర్వులను రద్దుచేయాలని, ఆ నిధులను నగరపాలక సంస్థ అవసరాలకు వాడాలని కోరుచూ ప్రతిపాదించడమైనది.

44/335- నగరపాలక సంస్థలో పనిచేయుచున్న డ్వాక్రా, సి.యం.ఇ.వై., కార్మికుల వేతనాలు రూ.3900/-లుగా ఇవ్వాలని జి.ఓ.నెం.1289ను ది.9-9-08న పంపడం జరిగినది. సదరు జి.ఓ.ను వెను వెంటనే అమలు చేయాలని కోరుచూ ప్రతిపాదించడమైనది.

<u>శ్రీ పత్తి నాగేశ్వర రావు, 28వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-</u>

45/336-స్థానిక భవానీపురంలోని గాలిబ్ షహీద్ దర్గా వారిచే వదలబడి, నగరపాలక సంస్థకు అప్పగించబడిన, 2.90 సెంట్ల స్థలంలో కళ్యాణ మండపం (షాదిఖానా) నిర్మించవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ కోరాడ రామ్మోహన రావు, 24వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

46/337- 24వ డివిజన్ నందున్న ఎలక్ట్రికల్ క్రిమిటోరియం చిమ్నీ నుండి దుమ్ము, ధూళి, వ్యర్థ పదార్థాలు స్వర్గపురిచుట్టూ ఉన్న నివాస గృహాలపై వెదజల్లబడకుండా నివారణకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ సి.హెచ్.బాబూరావు, 55వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

47/338- విజయవాడ నగరపాలక సంస్థకు చెందిన హైస్కూల్సు మరియు ప్రాథమిక పాఠశాలలందు విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకం అమలుకు అవసరమైన వంట గదులు నిర్మాణం వెంటనే చేపట్టాలని, పథకం సక్రమ అమలుకు బియ్యం, గ్యాస్ సబ్సిడీ ధరలపై సకాలంలో సప్లయి చేయుటకు తగు చర్యలు చేపట్టాలని ప్రతిపాదించటమైనది.

శ్రీమతి కాజా సరోజ, 19వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

48/339- 19వ డివిజన్ బెల్లపు శోభనాద్రి వీధి మెయిన్ రోడ్డు సైడు కాలువ పూర్తిగా వర్షాలకు పడిపోయినది. మురుగునీరు ప్రవహించడం లేదు. కావున వెంటనే బెల్లపు శోభనాద్రి వీధి మెయిన్ రోడ్డు సైడు కాలువ నిర్మించుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

49/340- 19వ డివిజన్ సూర్యారావు పేట, సూర్యనారాయణ రావు వీధి, రామానాయుడు వీధి, బాలాజీ వీధులలో భూ గర్భ డ్రైనేజీ పైపుల మెయిన్ లైన్లు ఏర్పాటు చేసి 8 నెలలు కాలం పూర్తి అయినది. కానీ రోడ్లు నిర్మించ లేదు. కావున, వెంటనే పై తెల్పిన 3 వీధులలో రోడ్లు నిర్మించవలసినదిగా కోరుతూ ప్రతిపాదించడమైనది.

50/341- 19వ డివిజన్ నిమ్మతోట సెంటర్ క్వారీ నందు 6, 7, 4, 5 రోడ్ల నందు సైడు కాలువలు, కల్వర్టులు పూర్తిగా దెబ్బతిని మురుగు నీరు ప్రవహించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున, సైడు కాలువలు, కల్వర్టులు యుద్ధ ప్రాతిపదికన నిర్మించుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

51/342- 19వ డివిజన్ బెల్లపు శోభనాద్రి వీధి (కస్తూరిబాయి పేట) నందు సైడు కాల్వ, కల్వర్టు పూర్తిగా దెబ్బతిన్నవి. కావున, వెంటనే నిర్మించుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

శ్రీ యస్.పి.గ్రిటన్, 18వ వార్డు; శ్రీ ఖాదర్, 27వ వార్డు మరియు శ్రీ నూకల నాగేశ్వర రావు, 39వ వార్డు మెంబర్ గార్ల ప్రతిపాదన :-

52/343- నగరపాలక సంస్థలోని నూతన కౌన్సిల్ హాలు భవనము చిన్నపాటి వర్షానికే మొదటి అంతస్తు మరియు గ్రౌండు ఫ్లోరులలో వర్షపు నీరు చేరి ప్రజలకు, కార్పోరేటర్లకు చాలా ఇబ్బంది కలుగుచున్నది. అంతేకాక ఈ భవనమునకు సంబంధించిన పిల్లర్ల యందు వున్న ఇనుము కూడా త్రుప్పుపట్టుచున్నది. కనుక, తక్షణమే కాంక్రీటు శ్లాబుతో పక్కా నిర్మాణము చేపట్టవలసినదిగా కోరుచూ ప్రతిపాదించుచున్నాము.

శ్రీ యస్.పి.గ్రిటన్, 18వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-

53/344- 18వ డివిజన్‌లోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో గల గ్యాలరీ అసంపూర్తిగా మద్యలోనే పనులు నిలిపివేసియున్నారు. కనుక మన కార్పోరేషన్ ద్వారాగాని, దాతలు మరియు స్వచ్ఛంధ సేవా సంస్థల ద్వారా నిలిచిపోయిన గ్యాలరీ పూర్తి స్థాయిలో నిర్మించుటకు మన మున్సిపల్ కార్పోరేషన్ తగు చర్య తీసుకొనవలసినదిగా కోరుచూ ప్రతిపాదించుచున్నాను.

శ్రీ నూకల నాగేశ్వర రావు, 39వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-

54/345- ఒన్ టౌన్ నుండి టూ టౌన్‌కు ప్రధాన రహదారి అయిన కాళేశ్వర రావు మార్కెట్టు ప్రక్కన గల లో-బ్రిడ్జి యందు గత నెల రోజుల నుండి త్రాగు నీరు పైపు లీకేజి అయి ప్రజలకు తీవ్ర అసౌకర్యము కలుగుచున్నది. దీనివల్ల ప్రమాదములు కూడా జరుగుచున్నవి. కనుక తగు చర్యలు మరియు తక్షణమే రోడ్డు రిపేరు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

**55/346**- గాంధీజీ హైస్కూల్ ఆవరణలో ఇండోర్ స్టేడియంను **4** సం.ములుగా కట్టుచున్నారు. ఇది ఎప్పటికి పూర్తి అగును. దీనిని తక్షణమే పూర్తి చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

సె క్ర ట రీ ,
విజయవాడ నగరపాలక సంస్థ.

అందరు వార్డు మెంబర్లకు మరియు ఎక్స్-అఫిషియో మెంబర్లకు.

నకలు:-స్థాయీ సంఘ ఛైర్‌పర్సన్ మరియు మేయరు గారికి,
,, డిప్యూటీ మేయరు గారికి,
,, కో-ఆప్టెడ్ మెంబర్లకు,
,, కమీషనరు గారికి మరియు అదనపు కమీషనరు (జనరల్) గారికి,
,, ఎగ్జామినర్ గారికి మరియు అందరు అధికారులకు,
,, అందరు సూపరింటెండెంటులకు,
,, నోటీసు బోర్డునకు.

దీ.24-10-2008 శుక్రవారము ఉదయము గం.10.30 ని॥లకు జరుగు
సాధారణ సర్వ సభ్య సమావేశమునకు కమీషనరు గారిచే ప్రవేశపెట్టబడిన అదనపు అంశములు

...

56/347- శ్రీ శిష్ట్లా శ్రీరామమూర్తి గారు ది. 23-6-08 గల అర్జీలో తనకు గవర్నరుపేట, ఎమ్.జి.రోడ్డు, మనోరమ హోటల్ దగ్గర డోరు నెం. 27-37-141, 142, 143, 144, 145/1 గల స్థలము 80.50 చ.గజములు మరియు గ్రౌండు ఫ్లోరు, మొదటి అంతస్తు బిల్డింగ్‌తో సహా రోడ్డు వైడెనింగ్ నందు కోల్పోయినట్లు తెలుపుతూ గత సం.ము అనగా ఫిబ్రవరి, 2007 లో తన ఆస్థి కోల్పోయినందుకు గాను స్ట్రక్చరల్ కాంపెన్సేషన్, ట్రాన్సఫరబుల్ FAR బాండు అలాగే కుందావారి కండ్రికలో ఇంటి స్థలము ఇచ్చుటకు అంగీకరించిన దరిమిలా స్ట్రక్చరల్ కాంపెన్సేషన్‌గా రూ.1,45,927/- లు తనకు చెల్లించినారనియు ఇంకను FAR బాండు, కండ్రికలో స్థలము ఇచ్చియుండలేదనియు ప్రస్తుతము తన ఆర్ధిక స్థితి బాగోనందున కండ్రికలో స్థలమునకు బదులుగా 85.50 చ.గజముల స్థలమునకు క్యాష్ కాంపెన్సేషన్ ఇప్పించవలసినదిగా కోరినారు.

పై విషయము ననుసరించి తెలియజేయునదేమనగా శ్రీ శిష్ట్లా శ్రీరామమూర్తి గారు తన ఆస్థిలో 85.50 చ.గజముల స్థలముతోపాటు బిల్డింగును కూడా కోల్పోయిన దరిమిలా వారికి స్ట్రక్చరల్ కాంపెన్సేషన్‌గా రూ.1,45,927/- లు చెల్లించడమైనది. అలాగే కుందా వారి కండ్రిలో విజయవాడ నగరపాలక సంస్ధకు చెందిన L.P.No.1/88 నందలి ప్లాటు నెంబర్లు 2104 నుండి 2109 వరకు అనగా 240 చ.గజముల స్థలము మంజూరు ప్రతిపాదనను స్ధాయీ సంఘం వారి ముందుంచగా, 5 వ వార్డు కమిటీ ఛైర్ పర్సన్ శ్రీమతి శ్రీదేవిగారు తమ డీసెంట్ నోటు నందు శ్రీ శిష్ట్లా శ్రీరామమూర్తి అను వారికి ఎమ్.జి.రోడ్డు వైడెనింగ్‌లో జరిగిన నష్టమునకు కుందావారి కండ్రికలో స్థలమును కేటాయించకుండా ఇతర ప్రాంతములలో మరొక స్థలమును కేటాయించుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా సూచించిన పిదప స్ధాయీ సంఘం వారు తమ తీర్మానము నెం.375, తేది. 25-1-2008 న పై ప్రతిపాదనను ఆమోదించి యున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ చట్టము నందలి సెక్షను 148 (3) ననుసరించి ఏదైనా ఆస్థిని దఖలు చేయుటకు ప్రతిపాదనను కౌన్సిల్ వారి ఆమోదముతో ప్రభుత్వము వారికి పంపవలసి యున్నందున శ్రీ శిష్ట్లా శ్రీరామమూర్తి గారికి 240 చ.గజముల స్థలము కేటాయించుటపై తగు నిర్ణయము కోరుచూ సదరు ప్రతిపాదనను కౌన్సిల్ వారి ముందుంచగా, కౌన్సిల్ వారు తమ తీర్మానము నెం.6, తేది.4-4-2008 లో ఆమోదము తెలుపుతూ ప్రభుత్వమునకు ప్రతిపాదన పంపుటకు తీర్మానించి యున్నారు.

దరిమిలా శ్రీ శిష్ట్లా శ్రీరామమూర్తి గారు తన అర్జీ నందు, ప్రస్తుతము తన ఆర్ధిక స్థితి బాగోలేనందున కండ్రికలో స్థలమునకు బదులుగా ఎమ్.జి.రోడ్డు విస్తరణలో తాను కోల్పోయిన 85.50 చ.గజముల స్థలమునకు క్యాష్ కాంపెన్సేషన్ ఇప్పించవలసినదిగా కోరినారు. అందుపై, ఆస్థి యజమానికి రోడ్డు వైడెనింగ్ నందు జరిగిన నష్టము యొక్క వివరములు ఈ క్రింద పేర్కొనడమైనది.

| | | | |
|---|---|---|---|
| (a) | రోడ్డు వైడెనింగ్‌లో యజమాని కోల్పోయిన స్థలము | -- | 85.50 చ.గజములు |
| (b) | ది. 31-7-07 ముందు మార్కెట్ పిలువ<br>(పటమట సబ్-రిజిస్ట్రారు బుక్ వాల్యూ ప్రకారము) | -- | రూ.22,000/-లు<br>ఒక చ.గ.నకు |
| (c) | కోల్పోయిన మొత్తము స్థలము పిలువ<br>(రూ.22,000 లు ఒక చ.గజము ప్రకారము) | -- | రూ.18,81,000/- |

(d) మొత్తము స్థలము విలువలో 50% విలువ -- రూ.9,40,500/-

సాధారణముగా రోడ్డు వైడెనింగ్‌లో ఆస్థి నష్టము జరిగిన వారికి పరిస్థితిని బట్టి, స్ట్రక్చరల్ కాంపెన్సేషన్, FAR బాండు, స్థల యజమాని భవన నిర్మాణము చేసుకొను సమయము నందు జి.ఓ.ఎమ్.ఎస్.నెం.33 ఎమ్.ఏ., తేది. 3-2-2001 ప్రకారం సెట్‌బ్యాక్ రిలాక్సేషన్స్‌తో ప్లాను అనుమతి మంజూరు చేయుట జరుగుచున్నది. కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో అనగా ఎక్కువ శాతం స్థలము కోల్పోయినప్పుడు మరియు భవనము విస్తరణ తదుపరి ఉపయోగించుటకు వీలుకాని పరిస్థితిలో ఉన్నప్పుడు మాత్రమే ఆ ప్రాంతపు సబ్-రిజిస్ట్రారు వాల్యుయేషన్ ప్రకారం వారు కోల్పోవు స్థలమునకు 50% కాంపెన్సేషన్ మంజూరు చేయుట జరుగుచున్నది.

కాబట్టి, అర్జీదారునకు 50% కాంపెన్సేషన్ అనగా రూ.9,40,500/- లు మంజూరు చేయు విషయములో నిర్ణయము కోరుచూ స్థాయీ సంఘము వారి ముందుంచగా స్థాయీ సంఘం వారు వారి తీర్మానము నెం.184, తేది.29-8-2008 లో సదరు విషయమును కౌన్సిల్ వారి సమావేశము నందుంచవలసినదిగా తీర్మానించినారు.

దరిమిలా శ్రీ శిష్ట్లా శ్రీరామమూర్తి గారు తేది.25-9-08 గల వారి అర్జీలో వారు తనకు గల స్థలములో 75% కోల్పోయినాననీ మరియు వారి వయసు, ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతము గల రిజిస్ట్రేషన్ విలువ చ.గ. నకు రూ.75,000/- చొప్పున లెక్కగట్టి నష్ట పరిహారము ఇప్పించవలసినదిగా కోరియున్నారు. అట్లైనచో చెల్లించవలసిన మొత్తము రూ.75,000 X 85.50 = రూ.64,12,500/- అగును.

అందుచేత, కౌన్సిల్ వారు తమ సి.ఆర్. నెం. 6, తేది.4-4-2008 నందు అర్జీదారునకు కుందావారి కండ్రిక నందలి L.P.No.1/88 లో 240 చ.గజముల స్థలము కేటాయించుటకు చేసిన తీర్మానమునకు బదులుగా అర్జీదారుడు రోడ్డు విస్తరణ యందు కోల్పోయిన స్థలమునకు అప్పటి సబ్-రిజిస్ట్రారు విలువ (అనగా తేది.31-7-2007 కు ముందు) ప్రకారము 50% కాంపెన్సేషన్ అనగా రూ.9,40,500/- లు మంజూరుచేయు విషయములో తగు నిర్ణయము కోరుచూ కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు సూచన చదవడమైనది. (ఆర్.సి. జి2-62693/05)

**57/348-** శ్రీ గోకరాజు గంగరాజు, కృష్ణా డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ది.**18-9-08** గల లేఖలో వారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వారి సహాయంతో ఇండోర్ క్రికెట్ ప్రాక్టీసింగ్ నెట్స్ నిర్మించుటకు తీర్మానించి నారనియు కనుక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో వాయువ్య దిక్కున KDCA-DV కృష్ణ మెమోరియల్ క్రికెట్ అకాడమీకి ప్రక్కన, హ్యాండ్ బాల్ ఏరియా వెనుకవున్న ఖాళీ స్థలములో **60** x 170 = 1133 చదరపు గజముల స్థలమును వారికి కేటాయించవలసినదిగా కోరియున్నారు. మరియు వారు సుమారు రూ.**25** లక్షలు ఖర్చుచేసి నేషనల్ మరియు ఇంటర్నేషనల్ క్రికెట్ క్రీడాకారులను తయారు చేయుటకు పథకము తయారు చేసినట్లు, విజయవాడ నగరపాలక సంస్థ వారి రూల్స్ మరియు రెగ్యులేషన్స్‌కు బద్దులమై ఉండెదమని తెలిపినారు.

దరిమిలా సదరు విషయమును పరిశీలించగా ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో వాయువ్య దిక్కున **60** x 150 = 1000 చదరపు గజముల ఖాళీ స్థలము కలదు. కనుక సదరు **1000** చదరపు గజముల స్థలమును కృష్ణా డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ వారికి కేటాయించు విషయములో తగు నిర్ణయము చేయుటకుగాను కౌన్సిల్ వారి ముందుంచిన ఆఫీసు సూచన చదవడమైనది. (ఆర్.సి.జి**2-40416/07**).

**58/349-** కరస్పాండెంట్, బాబూ జగ్జీవన్‌రామ్ ఎయిడెడ్ స్కూలు వారు తమ దరఖాస్తులో వాంబే కాలనీలో తమ స్కూలు నిమిత్తం స్థలం కేటాయించవలసినదిగా కోరి వున్నారు.

ఇందుపై శ్రీమతి టి.డి.వి.నాగలక్ష్మి, **47**వ డివిజన్ కార్పోరేటర్ గారు తమ ప్రతిపాదనలో కృష్ణలంక భ్రమరాంభపురం నందు గల పద్మావతి ఘాట్ ప్రాంతంలో లోగడ వున్న బాబూ జగ్జీవన్‌రామ్ ఎలిమెంటరీ స్కూలు ప్రస్తుతం వాంబే కాలనీలో అద్దె గదిలో నడుపబడుచున్నట్లు, సదరు స్కూలు నందు **200** మంది విద్యార్థులు వున్నట్లు, గవర్నమెంట్ వారిచే గుర్తింపబడి ప్రభుత్వ ఎయిడ్ కూడా కలిగివున్నట్లు సదరు స్కూలు

వారికి స్కూలు నిర్మాణం నిమిత్తం స్థలం కేటాయించవలసినదిగా ప్రతిపాదించివున్నారు.

ఇందుపై కౌన్సిల్ వారు తమ తీర్మానము నెం.**28**, ది.**28-4-07**లో ఆఫీసు రిమార్కులు కోరుచూ తీర్మానించివున్నారు.

ఇందుపై తెలియచేయునది వాంబే కాలనీ 'బి' బ్లాకులో డిస్పోల్యాండ్ ప్రక్క రోడ్డులోని స్థలము గుర్తింపబడినది. సదరు స్థలము డిస్పోల్యాండ్ **80'-0''** అడుగుల రోడ్డు వేయగా ప్లాట్ నెం.**287** ప్రక్కన **60'-0''** x **50'-0''** కొలతలు గల **263.88** చదరపు గజముల ఖాళీ స్థలము కలదు.

కావున, వాంబే కాలనీ 'బి' బ్లాకులో డిస్పోల్యాండ్ **80** అడుగుల రోడ్డు, ప్లాట్ నెం.**287** ప్రక్కన **60'-0''** x **50'-0''** కొలతలు గల **263.88** చదరపు గజముల ఖాళీ స్థలము బాబూ జగ్జీవన్‌రామ్ ఎయిడెడ్ స్కూలు వారికి ఇంగ్లీషు మీడియం స్కూలు నిర్మించుటకుగాను జిల్లా కలెక్టర్ గారు నిర్ణయించిన రేటు చెల్లించు పద్ధతిపై ప్రభుత్వం వారి అనుమతికి లోబడి కేటాయించుటపై కార్పోరేషన్ వారి నిర్ణయం కోరుచూ వుంచిన ఆఫీసు నోటు చదవడమైనది. **(ఆర్.సి.జి1-60881/06)**.

**59/350-** ప్రభుత్వము వారు జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.**314**, తేది: **18-10-08** నందు సూచించినట్లు పింఛనుదార్లకు రెండు దఫాలుగా మొత్తము **22% (15+7)** యింటీరిమ్ రిలీఫ్ మంజూరుచేసి యున్నారు.

యింటీరిమ్ రిలీఫ్ మొదటి దఫాగా **15%** ది.**1-10-2008** నుండి నవంబరు నెల **2008** పెన్షనుతో పాటు చెల్లించుటకు మరియు రెండవ దఫాగా **22%** ది.**1-1-2009** నుండి ఫిబ్రవరి నెల **2009** పెన్షనుతో పాటు చెల్లించవలసినదిగా సూచించడమైనది.

కావున, సదరు గవర్నమెంటు వారి ఉత్తర్వులు నెం.**314**, తేది: **18-10-08** ను విజయవాడ నగరపాలక సంస్థలో పెన్షను పొందుతున్న పింఛనుదార్లకు వర్తింపచేయుటకుగాను అనుమతి కొరకు మరియు రికార్డు నిమిత్తము కౌన్సిల్ వారి ఆమోదమునకు ఉంచడమైనది. **(ఆర్.సి.సి1-148166/08)**.

<u>విజయవాడ నగరపాలక సంస్థకు అనువర్తించబడిన **1955** హైదరాబాద్ మునిసిపల్ కార్పోరేషన్ చట్టములోని సెక్షన్-**88(జె)** ననుసరించి సప్లిమెంటరీ ఎజెండాలోని అదనపు అంశములు</u>

...

<u>శ్రీ వై.చలపతి రావు, **26**వ వార్డు; శ్రీ యం.రాజేశ్వర రావు, **48**వ వార్డు మరియు శ్రీ అడపా శేషగిరి, **22**వ వార్డు మెంబర్ గార్ల ప్రతిపాదనలు :-</u>

**60/351-** ఈనాడు నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని పాత గవర్నమెంటు హాస్పిటల్ నుండి ఏలూరు రోడ్డును కలుపుతూ కంట్రోలు రూం వద్ద రైవస్ కాలువ మీద మరొక బ్రిడ్జిని నూతనంగా నిర్మించుటకు ప్రతిపాదించుచున్నాము.

**61/352-** **30**వ డివిజన్ నందు కె.ఎల్. రావు పార్కు దగ్గర పారిశుద్ధ్య కార్మికులకు కేటాయించిన వి.ఎం.సి. క్వార్టర్స్ ప్రస్తుతం నివసిస్తున్న వారికి రిజిస్ట్రేషన్ సౌకర్యము కల్పించవలసినదిగా ప్రతిపాదించుచున్నాము.

**62/353-** **31**వ డివిజన్ నందు సిండికేటు బ్యాంకు రోడ్డులో రాకేష్ పబ్లిక్ స్కూలు వద్ద గల **5-7/8-98** నుండి సుమారు **36** మంది ఇళ్ళు నిర్మించుకొని గత కొద్ది సంవత్సరములుగా నివసించుచున్నారు. వారికి వెంటనే రిజిస్ట్రేషన్స్ సౌకర్యము కల్పించవలసినదిగా ప్రతిపాదించుచున్నాము.

<u>శ్రీ డి.వి.రమణబాబు, **31**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-</u>

**63/354-** తేది: **20-06-2008**న జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లో **31**వ డివిజన్ కె.యల్.రావు నగర్‌లోని మున్సిపల్ స్థలములో గత **30** సం.ముల నుండి నివాసముంటున్న నిరుపేదలకు చెందిన **43** ఇళ్ళకు రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేయు నిమిత్తం అంశము నెం.**69/142**లో ప్రతిపాదన ఇచ్చినాను. దీనిపై కౌన్సిల్‌లో చర్చించి జి.ఓ.ఎం.ఎస్. నెం.**166** ద్వారా సత్వరమే సదరు ఇళ్ళకు పట్టాలను రిజిస్ట్రేషన్ చేయుటకు తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.

కావున, తేది: **21-06-2008**న చేసిన తీర్మానము నెం.**69/142**ను అమలు చేయుటకు తక్షణ చర్యలు తీసుకొనుటకుగాను కోరుతూ ప్రతిపాదించడమైనది.

**64/355–** తేది: **20-06-2008**న జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లో **31**వ డివిజన్ చిట్టినగర్ ఏరియాలోని శాలివాహన సంఘం వీధులలో గత **50** సం.ముల నుండి నివసిస్తున్న షుమారు **185** ఇళ్ళకు ఇచ్చిన పట్టాలను రిజిస్ట్రేషన్ చేయు నిమిత్తం అంశము నెం.**68/141**లో ప్రతిపాదన చేసినాను. ఈ అంశముపై కౌన్సిల్ మీటింగ్‌లో చర్చించి, జి.ఓ.ఎం.ఎస్. నెం.**166** ద్వారా సత్వరమే సదరు ఇళ్ళ పట్టాలను రిజిస్ట్రేషన్ చేయుటకు సత్వర చర్యలూ తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.

కావున, ది.**21-06-2008**న చేసిన తీర్మానము నెం.**68/141**ను అమలు చేయుటకు తక్షణ చర్యలు తీసుకొనుటకుగాను కోరుతూ ప్రతిపాదించడమైనది.

<u>శ్రీమతి కాజా సరోజ, **19**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-</u>

**65/356–** **19**వ డివిజన్ గోపాలరెడ్డి రోడ్డు వెడల్పు చేయు సందర్భముగా గతంలో ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించడం జరిగినది. తదుపరి నిర్మాణం చేయకపోవడం వలన ప్రయాణీకులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్సు విద్యార్థులు, హాస్పిటల్స్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున, వెంటనే తప్పనిసరిగా బస్ షెల్టర్‌ను నిర్మాణం చేయుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

<u>శ్రీమతి కొప్పురపు శ్రీదేవి, **59**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-</u>

**66/357–** **59**వ డివిజన్ నేతాజీ సుభాష్ చంద్రబోస్ నగర్ నందు పునరావాసం కల్పించబడిన కాలనీగా, ఎక్కువ భాగం ఎస్.సి., ఎస్.టి., బి.సి., కులాలకు చెందిన ప్రజలు జీవించుచున్నారు. ఇక్కడ కమ్యూనిటీ హాలు లేకపోవడం వలన స్థానిక ప్రజలు ప్రభుత్వము నుండి పొందే సంక్షేమ పథకాలు వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నా తీవ్ర ఇబ్బందులకు, అసౌకర్యానికి గురి అవుచున్నారు. కావున, ఎన్.ఎస్.సి. బోస్ నగర్‌లో ప్లాట్ నెం.**703** సాయిబాబా గుడి వెనుక వైపున ఉన్న నగరపాలక సంస్థచే ప్రహరీ గోడ నిర్మించిన స్థలంలో కమ్యూనిటీ హాలు నిర్మాణమునకు తగు చర్యలు చేపట్టవలసినదిగా ప్రతిపాదించడమైనది.

<u>శ్రీ దాసరి దాస్ ప్రకాష్, **16**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదన :-</u>

**67/358–** వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్ మంజూరు అయిన వారికి ప్రతి నెలా **1, 5** తారీఖులలో ఇవ్వటం జరుగుచున్నది. అయితే ఇప్పుడు బిల్ కలెక్టర్స్ రేషన్ కార్డు ఉంటేనే పెన్షన్ ఇవ్వటం జరుగుతుందని ప్రజలు చెబుతున్నారు. అధికారులకు ఏమైనా సూచనలు ఇచ్చియున్నారా. ప్రజలు ఆందోళనకు గురి అవుచున్నారు. రేషన్ కార్డుతో నిమిత్తం లేకుండా పెన్షన్స్ యధాతదంగా ఇవ్వాలని ప్రతిపాదించుచున్నాను.

<u>శ్రీమతి చెన్నూరి సుభాషిణి, **36**వ వార్డు మెంబర్ గారి ప్రతిపాదనలు :-</u>

**68/359–** **36**వ డివిజన్ వించిపేట అంబేద్కర్ కాలనీ ప్రాంతం నందు ఎస్.సి., ఎస్.టి., కులాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. వారికి అందుబాటులో మలేరియా హాస్పిటల్ లేకపోవడం వలన స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనుచున్నారు. కావున, వెంటనే అక్కడ ఉన్న నగరపాలక సంస్థకు చెందిన ఖాళీ స్థలంలో మలేరియా హాస్పిటల్ ఏర్పాటు చేయవలసినదిగా ప్రతిపాదించడమైనది.

**69/360–** **36**వ డివిజన్ వించిపేట నైజాంగేటు సెంటర్ ప్రాంతంలో మసీదులు, స్కూల్సు, వ్యాపార కూడలి ప్రాంతంగా ఉండి ట్రాఫిక్ రద్దీ ప్రదేశంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పబ్లిక్ టాయిలెట్లు లేకపోవడం వలన స్థానికంగా బహిరంగ ప్రదేశాలలో విసర్జన చేయడం పలు ఇబ్బందులకి, అనారోగ్య వాతావరణమునకు కారణంగా ఏర్పడు చున్నది. కావున, వెంటనే అక్కడ **3** ప్రాంతాలలో పబ్లిక్ టాయిలెట్లు నిర్మాణం చేపట్టవలసినదిగా ప్రతిపాదించ డమైనది.

సెక్రటరీ,
విజయవాడ నగరపాలక సంస్థ.

విజయవాడ నగరపాలక సంస్థకు అనువర్తించబడిన 1955 హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ చట్టములోని సెక్షన్-88 (కె) ననుసరించి కమీషనర్ గారిచే ప్రవేశపెట్టబడిన అదనపు అంశములు

...

**70/361–** విజయవాడ నగరపాలక సంస్థ వారి ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నందు ఒలింపిక్ భవనమును నిర్మించుటకు గాను 1000 చ.గ.ల స్థలమును జిమ్ భవనము ప్రక్కగా మహాత్మాగాంధీ రోడ్డు వైపునకు వచ్చునట్లుగా కేటాయించ వలసినదిగా శ్రీ మాగంటి వెంకట నరసింహరావు గారు, 17వ డివిజన్ కార్పోరేటర్ గారు ప్రతిపాదించినారు.

సదరు స్థలము కేటాయింపుకై సి.ఆర్. నెం.21, ది.29-05-2006 ప్రకారం ఆఫీసు వారి రిమార్కులను కోరుతూ తీర్మానించడమైనది.

ప్రస్తుతము ఈ స్థలము నందు కార్పోరేషన్ వారి వాటర్ ట్యాంక్ నిర్మాణము జరుగుచున్నది. కావున ఒలింపిక్ భవనమునకు స్టేడియం పడమర ప్రక్కన 1000 చ.గ.ల స్థలమును కమీషనర్ గారు మరియు డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్సు వారు పరిశీలించి ఈ స్థలమును ఎటువంటి ఆటలు మరియు క్రీడలకు అవరోధము కల్గకుండా ఒలింపిక్ భవనమును నిర్మించుటకుగాను తదుపరి చర్యల నిమిత్తము ఆఫీసు సూచనను కౌన్సిల్ ముందు ఉంచడమైనది.
**(ఆర్.సి.డి.ఎస్.148320/08).**

71/362- జనరల్ మేనేజర్, టెలికం డిస్ట్రిక్ట్, విజయవాడ ది.2.8.99 గల లేఖ ద్వారా అజిత్‌సింగ్ నగర్‌లో టెలిఫోన్ ఎక్సేంజి భవనం నిర్మించుటకు 1500 చ.గ. ల స్థలము కేటాయించవలసినదిగా, స్థలము ఖరీదుకు రెవిన్యూ శాఖ వారు నిర్ణయించిన విధంగా చెల్లించగలమని తెలిపివున్నారు.

కార్పోరేషన్ వారు తమ తీర్మానం నెం.266 ది.24.10.2000 లో అజిత్‌సింగ్ నగర్ బ్లాక్ నెం.94, 96, 97, 99 ఎల్.పి.నెం.47/74 లోని 1356 చ.గల స్థలమును టెలికం శాఖ వారికి మార్కెట్ రేటు చెల్లించు పద్ధతిపై, కమ్యూనిటీ హాలు ఖరీదు ఇంజనీరింగు శాఖ వారు నిర్ణయించిన విధంగా చెల్లించు పద్ధతిపై ప్రభుత్వం వారి అనుమతికి లోబడి కేటాయించబడునని తీర్మానించివున్నారు. జిల్లా కలెక్టర్, కృష్ణాజిల్లా వారు తమ లేఖ నెం.H2-4851/02 ది.23.8.02 లో, అజిత్‌సింగ్ నగర్ ఎల్.పి.నెం.47/74 లోని స్థలమునకు చ.గ. రూ.2000/-లు గా నిర్ణయించినారు.

అయితే డిప్యూటీ జనరల్ మేనేజర్ (Plg.) B.S.N.L. వారు తమ లేఖ ది.2.6.04 గల లేఖలో ఎల్.పి.నెం.47/74 లోని 500 చ.గల స్థలము లీజు క్రింద కేటాయించి, పుష్కరాల దృష్ట్యా ముందుగా అప్పగించవలసినదిగా కోరివున్నారు.

ఇందుపై ఈ కార్యాలయపు లేఖ నెం.23612/99 ది.23.7.04 ద్వారా అజిత్‌సింగ్ నగర్‌లోని ఎల్.పి.నెం.47/74 లోని 500 చ.గల స్థలము లీజుపై కేటాయించి ఈ క్రింది షరతులపై స్థలము ముందుగా అప్పగించడమైనది.

1. సదరు స్థలము లీజుపై స్థాయి సంఘం / కౌన్సిల్ ఆమోదమునకు లోబడి కేటయించడమైనది.
2. B.S.N.L. వారు విజయవాడ నగరపాలక సంస్థ వారు ఇచ్చు లీజు కండిషన్స్ కి బద్ధులై వుండవలెను.
3. విజయవాడ నగరపాలక సంస్థ వారికి సదరు ఉత్తర్వులు రద్దుపరచి స్థలము తిరిగి స్వాధీనపరచుకొను హక్కులు వున్నవి.

సదరు స్థలము అజిత్‌సింగ్ నగర్ బ్లాక్ నెంబర్లు 97 మరియు 94 మధ్య లేఅవుట్ ఖాళీ స్థలము అయివున్నది. B.S.N.L. వారు మొత్తం 467 చ.గల స్థలము (53'-6'' x 78'-6'') స్వాధీన పరచుకొని ప్రహారీగోడ నిర్మాణం చేసివున్నారు. సదరు స్థలములో B.S.N.L. టవర్ ఏర్పాటు చేసివున్నారు.

అయితే B.S.N.L. వారు ఇప్పటివరకు విజయవాడ నగరపాలక సంస్థకు ఎటువంటి అద్దెను చెల్లించి యుండలేదు. సదరు స్థలము లీజు అద్దెను నిర్ణయించుటకు రెవిన్యూ శాఖ వారికి పంపగా వారు సదరు స్థలము అద్దె జూలై 2004 సంవత్సరం నుండి సంవత్సరమునకు లక్ష రూపాయలుగా నిర్ణయించి ప్రతి మూడు సంవత్సరములకు 33 1/3 శాతం అద్దె పెంపుదలపై స్థాయి సంఘం వారి అమోదం నకు లోబడి నిర్ణయించవలసినదిగా తెలిపివున్నారు.

కావున అజిత్‌సింగ్ నగర్, ఎల్.పి.నెం.47/74 లో బ్లాక్ నెం.97 మరియు 94 మధ్యన B.S.N.L. వార్కి లీజుపై కేటాయించిన 467 చ.గల స్థలమునకు సంవత్సరమునకు అద్దె లక్ష రూపాయలుగా జూలై

2004 నుండి వసూలు చేయుటకు మూడు సంవత్సరముల తదుపరి జూలై 2007 నుండి సదరు అద్దెను 33 1/3 శాతం పెంచి వసూలు చేయుటకు స్థాయి సంఘం వారి ఆమోదం కోరుచు వుంచగా స్థాయీ సంఘం వారు తమ తీర్మానం నెం.183 ది.29.8.08 గల తీర్మానంలో ఏ ఏ టెలిఫోన్ కంపెనీలకు ఏ ఏ ప్రదేశాలలో ఎంత స్థలాన్ని లీజుకు ఇవ్వడమైనది? ఏ ఏ టవర్లు, ఎక్కడ ఎప్పుడు నెలకొల్పారు? వాటి నుండి ఎంత రుసుము వసూలు జరుగుచున్నది? తదితర వివరాలతో తదుపరి కౌన్సిల్ సమావేశమునందుంచవలసినదిగా తీర్మానించివున్నారు.

ఇందుపై తెలియచేయునది, విజయవాడ నగరపాలక సంస్థ వారు అజిత్‌సింగ్ నగర్‌లో పైన తెలిపిన స్థలము మినహా ఇతర ప్రదేశాలలో టెలిఫోన్ కంపెనీలకు స్థలాలు లీజుకు ఇచ్చియుండలేదు. మరియు వివిధ టెలిఫోన్ కంపెనీల వారు భవనాలపై ఏర్పాటు చేయు టవర్స్ ప్రభుత్వం గారి మెమో నెం.2371/2002-1, M.A. ది.27.2.2002 మొదలయిన వాటి ప్రకారం మంజూరు చేసిన మినహాయింపు ప్రకారం ఏర్పాటు చేయబడుచున్నవి. కావున వివిధ టెలిఫోన్ కంపెనీలు ఏర్పాటు చేయు టవర్స్ నుండి ఎటువంటి రుసుము వసూలు చేయబడుటలేదు.

కావున అజిత్‌సింగ్ నగర్, ఎల్.పి.నెం.47/74 బ్లాక్ నెం.97 మరియు 94 మధ్యన B.S.N.L. వారికి లీజుపై కేటయించిన 467 చ.గల స్థలమునకు సంవంత్సరమునకు అద్దె లక్షరూపాయలుగా జూలై 2004 నుండి వసూలు చేయుటకు మరియు ప్రతి మూడు సంవత్సరములకు 33 1/3 శాతం అద్దె పెంపుదల చేయుచూ తదుపరి జూలై 2007 నుండి సదరు అద్దెకు 33 1/3 శాతం పెంచి రూ.1,33,330/-లు వసూలు చేయుటకు కార్పోరేషన్ వారి ఆమోదం కోరుచూ వుంచిన ఆఫీసు నోటు చదవడమైనది.
(ఆర్.సి.జి1-23612/99)

72/363- శ్రీమతి పెన్మెత్స దుర్గాభవానీ 53వ వార్డు మెంబర్ గారు తమ ప్రతిపాదనలో మన్యం వీరులు, విప్లవ యోధుడు, శ్రీ అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహమును దాతల సహకారంతో 53వ డివిజన్ పరిధిలోని బుడమేరు రెండు వంతెనల మధ్యలో ప్రతిష్టించుటకు గాను అనుమతి కోరుచూ ప్రతిపాదించివున్నారు.

ఇందుపై కార్పోరేషన్ వారు తమ తీర్మానం నెం.33/33 ది.2.5.07 గల తీర్మానంలో ఆఫీసు వారి రిమార్కులు కోరుచూ తీర్మానించివున్నారు.

ఇందుపై తెలియచేయునది, సింగ్‌నగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో బుడమేరు రెండు బ్రిడ్జిల మధ్యన వున్న స్థలంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు ప్రతిపాదించి వున్నారు. సదరు రెండు బ్రిడ్జిల మధ్య విగ్రహం ఏర్పాటుకు స్థలము వున్నది. ధరఖాస్తుదారులు, బుడమేరు రెండు బ్రిడ్జిల మధ్య అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్.అండ్.బి విజయవాడ నెం.General/D1/08 ది.22.5.08లో తమ అనుమతి ఇచ్చివున్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, స్పెషల్ డివిజన్, ఇరిగేషన్ శాఖ వారు నెం.352M ది.26.5.08 గల లేఖలో సదరు విగ్రహం ఏర్పాటుకు కౌన్సిల్, విజయవాడ నగరపాలక సంస్థ అనుమతి పొందవలసినదిగా కోరివున్నారు.

ఇందుపై తెలియచేయునది, ప్రభుత్వం వారి ఉత్తర్వులు నెం.55 ది.8.4.03 లో విగ్రహాల ఏర్పాటుపై గైడ్‌లైన్స్ జారీ చేసివున్నారు. సదరు గైడ్‌లైన్స్ ప్రకారం విగ్రహాల ఏర్పాటుకు పెద్ద ట్రాఫిక్ ఐలాండ్స్, గార్డెన్స్, పార్క్స్ మరియు ప్రభుత్వ అవరణలలో జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన గల కమిటీ సిఫార్స్‌పై ప్రభుత్వ అనుమతికి లోబడి ఏర్పాటు చేయవలసివున్నది. జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన గల విగ్రహ కమిటీలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆర్. అండ్ బి, లోకల్ మున్సిపల్ చైర్మన్, సూపరింటెండింగ్ ఇంజనీర్(పి.ఆర్), సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్.అండ్ బి) వారు ట్రాఫిక్, రోడ్లు వైడనింగ్, నీటి డ్రైయినేజి సప్లై మరియు కరెంట్ మరియు టెలిఫోన్ లైన్స్ మొదలయిన అంశములపై పరిశీలించి N.O.C. ఇవ్వవలసివున్నది.

కావున బుడమేరు రెండు బ్రిడ్జిల మధ్యన గల స్థలంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కాంశ్య విగ్రహం ఏర్పాటుకు సంబంధిత శాఖల N.O.C. లు జిల్లా కలెక్టర్ గారి అధ్యక్షతన గల కమిటీ ఆమోదం మరియు ప్రభుత్వం వారి ఉత్తర్వులకు లోబడి అనుమతించుటపై కౌన్సిల్ వారి నిర్ణయం కోరుచూ వుంచిన ఆఫీసు సూచన చదవడమైనది. (ఆర్.సి.జి7-123501/08)

సెక్రటరీ,
విజయవాడ నగరపాలక సంస్థ.

## ది.24-10-2008 శుక్రవారము ఉదయము గం.10.30 ని॥లకు జరుగు విజయవాడ నగరపాలక సంస్థ సాధారణ సర్వ సభ్య సమావేశపు తీర్మానములు

సభ్యుల హాజరు

1. శ్రీమతి మల్లిక బేగం,
   మేయరు మరియు సభాధ్యక్షులు
2. శ్రీ సామంతపూడి నరసరాజు,
   డిప్యూటీ మేయరు.
3. శ్రీ వెంకట సత్యనారాయణ
4. శ్రీ ముసునూరి సుబ్బారావు
5. శ్రీ కలపాల అంబేద్కర్
6. శ్రీమతి అన్నే ప్రసన్న
7. శ్రీ ఇజ్జాడ అప్పలనాయుడు
8. శ్రీమతి నల్లూరు ఉషారాణి
9. శ్రీమతి కోనేరు రమాదేవి
10. శ్రీ రామాయణపు శ్రీనివాస రావు
11. శ్రీ నడకుదిటి సుబ్బరాజు
12. శ్రీమతి కోగంటి విమలకుమారి
13. శ్రీ ఉమ్మడిశెట్టి బహదూర్
14. శ్రీ దాసరి దాస్ ప్రకాష్
15. శ్రీ మాగంటి వెంకట నరసింహారావు
16. శ్రీ సిరిపురపు ఫిలిప్స్ గ్రిటన్
17. శ్రీమతి కాజా సరోజ
18. శ్రీమతి ముత్తంశెట్టి వెంకట రత్న బిందు
19. శ్రీ అడపా శేషగిరి
20. శ్రీ కాశీనాథ్ దోనేపూడి
21. శ్రీ కోరాడ రామ్మోహన రావు
22. శ్రీ బుద్దా జగన్నాథం
23. శ్రీ యలకల చలపతి రావు
24. శ్రీ ఖాదర్
25. శ్రీ పత్తి నాగేశ్వర రావు
26. శ్రీ గుమ్మడిదల కోటేశ్వర రావు
27. శ్రీ తాజ్‌నోత్ దాసు
28. శ్రీ ధూళిపూడి వెంకట రమణ బాబు
29. శ్రీ షేక్ కరీముల్లా
30. శ్రీమతి చిలకా సలోమి
31. శ్రీమతి చెన్నూరి సుభాషిణి
32. శ్రీ బోయి సత్యబాబు
33. శ్రీ మహదేవు అప్పాజీరావు
34. శ్రీ నూకల నాగేశ్వర రావు
35. శ్రీమతి దుట్టా వెంకట మహాలక్ష్మి
36. శ్రీ కునుకు రాజశేఖర్
37. శ్రీమతి వీరమాచినేని లలిత
38. శ్రీ పూనూరు గౌతమ్ రెడ్డి
39. శ్రీమతి పిల్లి లక్ష్మి తులసి
40. శ్రీమతి తాడికొండ దుర్గా వెంకట నాగలక్ష్మి
41. శ్రీ మీసాల రాజేశ్వర రావు
42. శ్రీ దోనేపూడి శంకర్
43. శ్రీ శిష్ట్లా రామలింగ మూర్తి
44. శ్రీ ఎరుబోతు రమణారావు
45. శ్రీ గోగుల రమణారావు
46. శ్రీ చిగురుపాటి బాబూరావు
47. శ్రీ బి.హెచ్.యస్.వి.జానారెడ్డి
48. శ్రీమతి వీర్ల వరలక్ష్మి
49. శ్రీమతి మురిపాల సత్యవతి
50. శ్రీమతి కొప్పురపు శ్రీదేవి

ఎక్స్-అఫిషియో సభ్యులు:-

1. శ్రీ షేక్ నాసర్ వలి, ఎం.ఎల్.ఏ.,
   పశ్చిమ నియోజక వర్గ శాసన సభ్యులు.
2. శ్రీ జల్లి విల్సన్, ఎం.ఎల్.సి.,

కో-ఆప్టెడ్ సభ్యులు:-

1. శ్రీ సంపర రామ్మోహన రావు
2. శ్రీమతి కడియం చారమ్మ
3. శ్రీ మునీర్ అహ్మద్

సభకు గౌ॥ మేయరు శ్రీమతి మల్లిక బేగం గారు అధ్యక్షత వహించినారు.

సంతాప తీర్మానము :

జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న కురు వృద్ధులు, వరుసగా ఐదుసార్లు పార్లమెంటుకు ఎన్నికైన వ్యక్తిగా రికార్డులకెక్కి, కృష్ణా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా, తర్వాత జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా సుదీర్ఘ కాలం సేవలందించిన ప్రజానేత, సీనియర్ నాయకుడిగా పేరు పొందిన మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ మాగంటి అంకినీడు గారు ది.08-09-2008న మృతి చెందినారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేస్తూ ఈ కౌన్సిల్ తీర్మానించడమైనది.

**1/292** – ధృవపర్చటమైనది.

**2/293** – ప్రశ్నలు – జవాబులు.

**3/294** – ఆఫీసు సూచన ఆమోదించడమైనది.

**4/295, 10/301, 12/303** మరియు **44/335.** – జి.ఓ.ఆర్.టి. నెం.**1289**, తేది: **9-9-2008** ఎం.ఏ. అండ్ యు.డి. డిపార్టుమెంటు ఉత్తర్వులు రికార్డు చేస్తూ, ది.**1-10-2008** నుండి అమలుపరచుటకు చర్యలు తీసుకోవలసినదిగా నిర్ణయిస్తూ తీర్మానించడమైనది.

**5/296** – జూనియర్ అసిస్టెంట్ శ్రీమతి ఎమ్.నిర్మల జ్యోతి అప్పీలును పరిగణనలోకి తీసుకొని A.P.CCA రూల్సు **1991** ప్రకారం ఆఫీసు వారు విధించిన శిక్షను, మొదటి తప్పుగా భావించి రద్దుపర్చుచూ తీర్మానించడమైనది.

**6/297** – రికార్డు చేయడమైనది.

**7/298** – ర్యాటిఫై చేయడమైనది.

**8/299** – రికార్డు చేయడమైనది.

**9/300** – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**11/302** – ఆమోదించుచూ, ఆఫీసు వారిని అంచనాలు తయారు చేయవలసినదిగా తీర్మానించడమైనది.

**13/304** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**14/305** – ''హెల్పేజ్ ఇండియా'' వారితో సంప్రదింపులు జరిపి, విజయవాడ నగరంలో సీనియర్ సిటిజన్స్‌కు ఉపయోగపడే విధంగా తగు చర్యలు తీసుకోవలసినదిగా ఆమోదించడమైనది.

**15/306** – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**16/307** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**17/308** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**18/309, 21/312** మరియు **43/334.** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**19/310** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**20/311** – గత అనేక సంవత్సరములుగా నివాసముంటూ, మురికివాడలుగా గుర్తింపు పొంది, నగరపాలక సంస్థ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించబడిన ప్రాంతాల యందలి పేద ప్రజల తరపున న్యాయ పోరాటం చేయుటకు, స్థానిక ప్రజల నుండి అభ్యర్థన వచ్చిన యెడల న్యాయపరమైన సహకారం కల్పించుటకు నిర్ణయిస్తూ తీర్మానించడమైనది.

**22/313** – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

పై అంశముపై శ్రీ పి.గౌతమ్ రెడ్డి, **44**వ వార్డు మరియు శ్రీ సిహెచ్.బాబూరావు, **55**వ వార్డు మెంబర్ గార్లచే ఈ క్రింది సవరణ తీర్మానమును ప్రవేశపెట్టగా, శ్రీ దోనేపూడి కాశీనాథ్, **23**వ వార్డు మరియు శ్రీ ఎరుబోతు రమణా రావు, **52**వ వార్డు మెంబర్ గార్లు బలపర్చినారు.

<u>సవరణ తీర్మానము</u> :

''మహంతీ మార్కెట్టు, గోవింద రాజుల మార్కెట్టులను పున:నిర్మించటానికి పిలిచిన పి.పి.పి.ని రద్దుపర్చి నగరపాలక సంస్థయే తిరిగి ఈ మార్కెట్టులను పునః నిర్మించాలని ప్రస్తుతము వ్యాపారము చేస్తున్న వారందరికీ ఎటువంటి గుడ్‌విల్ లేకుండా తిరిగి వారికి షాపులు కేటాయించాలనీ, ఆలోపు వారందరికీ అనువైన స్థలములో ప్రత్యామ్నాయము చూపాలని తీర్మానించడమైనది''.

పై సవరణ తీర్మానముపై వాయిస్ ఓటింగ్ పెట్టగా, సవరణకు అనుకూలముగా **21** మంది సభ్యులు, వ్యతిరేకముగా **22** మంది సభ్యులు ఓటుచేసినారు.

కావున, పై సవరణ తీర్మానము వీగిపోయినదని, ప్రతిపాదిత తీర్మానము ఆమోదించబడినదని సభాధ్యక్షులవారైన గౌ॥ మేయరు గారు ప్రకటించినారు.

**23/314** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**24/315** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**25/316** – విలీనంనకు ఆమోదము తెలుపుతూ వి.జి.టి.ఎం., ఉడా వార్కి తగు చర్యలు నిమిత్తం పంపుటకు తీర్మానించడమైనది.

**26/317** – జి.ఓ.యం.యస్. నెం.**349** యం.ఏ., తేది: **17-7-86** ప్రకారం తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.

**27/318** – ప్రతిపాదన ఆమోదించడమైనది.

**28/319** – వెంటనే తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.

**29/320** – తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.

**30/321** – ఇందుకు సంబంధించి పూర్తి సమాచారమును తదుపరి సమావేశమునందుంచుమా అప్పటి వరకు ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌పై ఎటువంటి చర్య తీసుకొనరాదని తీర్మానించడమైనది.

**31/322** – ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**32/323** నుండి
**34/325** వరకు } ప్రతిపాదన ఆమోదించడమైనది.

**35/326** – కుట్టు శిక్షణా కేంద్రాలను కొనసాగించవలసినదిగాను, మరియు శిక్షణా కేంద్రం ప్రారంభ నెల నుండి బాధ్యతలు వహిస్తున్న వారికి గౌరవ పారితోషికం వెంటనే చెల్లించవలసినదిగా తీర్మానించడమైనది.

**36/327** నుండి
**38/329** వరకు — ప్రతిపాదన ఆమోదించడమైనది.

**39/330 – 55, 56, 57, 58** అండ్ **59** డివిజన్లలోని ప్రజలకు ఉపయోగపడే విధంగా స్థలములను పరిశీలించి కర్మల భవనము నిర్మించవలసినదిగా తీర్మానించడమైనది.

**40/331 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**41/332 –** ప్రస్తుతం ఎన్.హెచ్.-**9** రోడ్డు నగర పరిధిలో **90** అడుగులుగా, కొన్ని ప్రాంతాలలో **100** అడుగులుగా రక రకాలుగా వుండటం వలన, మరియూ **200** అడుగుల వెడల్పు చేయవలెనన్న అనేక కుటుంబాలు నష్టపోవును గాన, ఎన్.హెచ్.-**9** రోడ్డును ప్రస్తుత నగర పరిధి వరకు **120** అడుగులుగా మార్పు చేయవలసినదిగా సంబంధిత శాఖలను కోరుటకు తీర్మానించడమైనది.

**42/333 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**45/336 –** ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**46/337 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.
**47/338 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**48/339 –** ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**49/340** నుండి
**52/343** వరకు — ప్రతిపాదన ఆమోదించడమైనది.

**53/344 –** అసంపూర్తిగా నిలిచిపోయిన 'గ్యాలరీ' ని కార్పోరేషన్ నిధుల ద్వారాగానీ దాతలు మరియు స్వచ్ఛంధ సేవా సంస్థల ద్వారా గానీ, ఎం.పి., ఎం.ఎల్.ఏ.,ల నిధుల నుండి గాని 'గ్యాలరీ' పూర్తి స్థాయిలో నిర్మించుటకు తగు చర్యలు తీసుకొనవలసినదిగా తీర్మానించడమైనది.

**54/345 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**55/346 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**56/347 –** ది.**31-7-2007** నాటి పటమట సబ్-రిజిస్ట్రారు బుక్ వ్యాల్యూ ప్రకారము ఒక చదరపు గజమునకు రూ.**22,000/-**లు చొప్పున, పోయిన స్థలమునకు విలువకట్టి చెల్లించవలసినదిగా తీర్మానించడమైనది.

**57/348 –** పరిశీలనార్థము వాయిదా వేయడమైనది.

**58/349 –** ఆఫీసు సూచన ఆమోదించడమైనది.

పై అంశముపై శ్రీ సిహెచ్.బాబూరావు, **55**వ వార్డు మెంబర్ గారు ఈ క్రింది సవరణ తీర్మానము ప్రవేశపెట్టగా, శ్రీ ఎరుబోతు రమణా రావు, **52**వ వార్డు మెంబర్ గారు బలపర్చినారు.

సవరణ తీర్మానము :

''బాబూ జగజ్జీవన్‌రామ్ ఎయిడెడ్ స్కూలును నగరపాలక సంస్థలో విలీనము చేసుకొని, అజిత్‌సింగ్ నగర్ వాంబే కాలనీలో నగరపాలక సంస్థ నిర్వహించాలని తీర్మానించడమైనది''.

పై సవరణ తీర్మానముపై వాయిస్ ఓటింగ్ పెట్టగా, సవరణకు అనుకూలముగా **13** మంది సభ్యులు, వ్యతిరేకముగా **14** మంది సభ్యులు ఓటుచేసినారు.

కావున, పై సవరణ తీర్మానముపై ఓటింగ్ దృష్ట్యా సవరణ తీర్మానము వీగిపోయినదని, ప్రతిపాదిత తీర్మానము ఆమోదించబడినదని సభాధ్యక్ష్యులవారైన గౌ॥ మేయరు గారు ప్రకటించినారు.

**59/350 –** రికార్డు చేయడమైనది.

**60/351 –** ప్రతిపాదన ఆమోదించుచూ ఒన్–టౌన్ మరియు టూ–టౌన్ ప్రాంతములకు ప్రధాన లింకు రహదారి అభివృద్ధిపరచుటకు ఈ మధ్య కాలములో పడిపోయిన పాత బస్టాండు భవనము స్థలమును కార్పోరేషన్‌కు దఖలుపర్చవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుటకు నిర్ణయిస్తూ తీర్మానించడమైనది.

**61/352** నుండి **64/355** వరకు – తక్షణమే తగు చర్యలు తీసుకోవలసినదిగా తీర్మానించడమైనది.

**65/356 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**66/357 –** ఆఫీసు వారి రిమార్కులు కోరుతూ తీర్మానించడమైనది.

**67/358 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**68/359 –** ప్రతిపాదన ఆమోదించడమైనది.

**69/360 –** ప్రతిపాదన ఆమోదించుచూ స్వచ్ఛంధ సంస్థల సహకారముతో నిర్మాణములు చేపట్టవలసినదిగా తీర్మానించడమైనది.

**70/361** మరియు **71/362** – వాయిదా వేయడమైనది.

**72/363 –** ఆఫీసు సూచన ఆమోదించడమైనది.

సభాధ్యక్షుల వారైన గౌ॥ మేయరు గారు రాత్రి గం.**8.35** ని॥లకు సభ ముగిసినట్లు ప్రకటించినారు.

సం./– వి. రవీంద్ర,
సెక్రటరీ ,
విజయవాడ నగరపాలక సంస్థ.

సం./– మల్లిక బేగం,
మేయరు మరియు సభాధ్యక్షులు,
విజయవాడ నగరపాలక సంస్థ.

//నకలు//

సె క్ర ట రీ ,
విజయవాడ నగరపాలక సంస్థ.